

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 21-06-2025 | సంపుటి - 24 | సంచిక - 50 | రూ : 4 | పేజీలు: 8



## బ్యాంకింగ్ వ్యవస్థలోనే లోపాలున్నాయి

- ఛార్జీల పేరుతో సామాన్యులపై భారం వేస్తున్నారు..
- రూ.వేల కోట్లు ఎగవేసిన వారిని వదిలేస్తున్నారు
- బ్యాంకు అధికారుల తీరుపై హైకోర్టు వ్యాఖ్యలు

2లో

### కాళేశ్వరంపై మంత్రివర్గ నిర్ణయాల వివరాలు..

# 30లోగా అందజేస్తాం

- జస్టిస్ ఘోష్ కమిషన్‌కు సీఎంవో లేఖ

**జూన్ 20, హైదరాబాద్:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి సంబంధించి పునరాకృతి, మంత్రివర్గ ఉపసంఘం, మంత్రివర్గం నిర్ణయాల వివరాలను ఈ నెల 30లోగా అందజేస్తామని సీఎంవో... జస్టిస్ ఘోష్ కమిషన్‌కు లేఖ రాసింది. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు ఈటల రాజేందర్, హరీశ్‌రావులు... నిర్ణయాలన్నీ మంత్రివర్గ ఆమోదంతో తీసుకొన్నట్లు కమిషన్ ఎదుట చెప్పడంతో, వాటిని నిర్ధారించుకునేందుకు కమిషన్ ప్రభుత్వానికి లేఖ రాసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణానికి సంబంధించిన ఉత్తర్వులు జారీచేసిన సమయానికి మంత్రివర్గ ఆమోదం ఉందా, లేదా అన్న వివరాలను నీటిపారుదల శాఖ నుంచి సేకరిస్తున్నారు. ప్రాణహిత

తరువాయి 2లో



## ట్రంప్ అమెరికా ఆహ్వానాన్ని తిరస్కరించా

- ఒడిశా పర్యటనకే ప్రాధాన్యమిచ్చి ఇక్కడకు వచ్చాను
- భువనేశ్వర్ సభలో ప్రధాని మోదీ వెల్లడి

జూన్ 20, భువనేశ్వర్: వాషింగ్టన్‌ను సందర్శించాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానాన్ని సున్నితంగా తిరస్కరించినట్లు ప్రధాన మోదీ వెల్లడించారు. వివిధ అంశాలపై వాషింగ్టన్‌లో చర్చించుకుందామని, కలిసి లంచ్ చేద్దామని ట్రంప్ తెలిపారన్నారు. ఇటీవల జీ7 సదస్సులో పాల్గొనేందుకు కెనడా వెళ్లినప్పుడు ట్రంప్ ఫోన్ చేసి మాట్లాడారని మోదీ పేర్కొన్నారు. ఒడిశాలో భాజపా ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన

తరువాయి 2లో





# సాగు సాయం

# రూ.1.04 లక్షల కోట్లు

- ధాన్యం కొనుగోళ్లు, సన్నాల బోనస్‌కు రూ.43 వేల కోట్లు
- రైతు భరోసాకు రూ.21 వేల కోట్లు
- పంట రుణమాఫీకి రూ.20 వేల కోట్లు
- ఏడాదిన్నరలోనే వ్యవసాయానికి భారీగా నిధుల వ్యయం
- 'రైతు రాజ్యం' పేరిట విడుదల చేసిన నివేదికలో ప్రభుత్వం వెల్లడి

హైదరాబాద్: వ్యవసాయ రంగం, రైతుల సంక్షేమానికి ఏడాదిన్నర వ్యవధిలోనే భారీగా నిధులు ఖర్చు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన అనంతరం అమలు చేసిన పథకాలకు రూ.1.04 లక్షల కోట్లను వెచ్చించినట్లు వెల్లడించింది. ధాన్యం కొనుగోళ్లు, సన్నాల బోనస్‌కు రూ.43 వేల కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొంది. ప్రస్తుత వానాకాలంలో

తరువాయి 2లో

# నూతన శతకారంభం

- సెంచరీలతో మెరిసిన శుభ్‌మన్, యశస్వి
- భారత్ 359/3
- ఇంగ్లాండ్‌తో తొలి టెస్టు లీడ్స్

ఆరంభం అదిరింది.. కానీ: 91/0.. కాసేపట్లో లంచ్ అనగా భారత్ స్కోరిది. టాస్ గెలిచి తమను బ్యాటింగ్ దించిన ఇంగ్లాండ్ నిర్ణయం తప్పని నిరూపిస్తూ తొలి సెషన్ ఆఖరి దాకా టీమ్ఇండియా పైచేయి సాధించింది. కానీ 6 నిమిషాల వ్యవధిలో.. 6 బంతుల తేడాలో ఇంగ్లాండ్ మ్యాచ్‌లోకి వచ్చింది. అంతకుముందు బ్యాటింగ్‌కు దిగిన భారత్ జాగ్రత్తగా ఆడింది. యశస్వి జైస్వాల్‌తో ఎవరు జతగా వస్తారనే చర్చకు తెర దించుతూ అనుభజ్ఞుడైన కేఎల్ రాహుల్ ఓపెనింగ్ చేశాడు. ఆరంభంలో స్వింగ్‌తో ఇంగ్లాండ్ పేసర్లు.. యశస్వి,

తరువాయి 2లో




గిల్ 127*





# సై అంటే సై

- మరింత తీవ్రంగా ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం
- హైఫా, బీర్‌షిబా, టెల్ అవీవ్‌లపై ఇరాన్ క్షిపణులు
- ఇరాన్‌పైకి దూసుకెళ్లిన 60 యుద్ధ విమానాలు
- ఆ దేశ రక్షణ పరిశోధన కేంద్రం ధ్వంసం

టెల్ అవీవ్/టెహ్రాన్: అటు ఇజ్రాయెలూ తగ్గడం లేదు. ఇటు ఇరానూ వెనుకడుగు వేయడం లేదు. సై అంటే సై అంటున్నాయి. యుద్ధం ఎనిమిదో రోజైన శుక్రవారం పరస్పర దాడుల తీవ్రతను మరింత పెంచాయి. ఒకవైపు యుద్ధం ఆపడానికి జెనీవాలో చర్చల ప్రక్రియ ప్రారంభమైనా.. రెండు దేశాలు బాంబుల వర్షాన్ని కురిపిస్తూనే ఉన్నాయి. టెల్ అవీవ్, హైఫా, బీర్‌షిబా నగరాలపై బాలిస్టిక్ క్షిపణులతో ఇరాన్ విరుచుకుపడింది. ముఖ్యంగా బీర్‌షిబాలోని టెక్నాలజీ పార్కుపై దాడి చేసింది. ఈ ఘటనలో పలు భవనాలకు నష్టం వాటిల్లింది. మైక్రోసాఫ్ట్ కార్యాలయం సమీపంలో మంటలు ఎగసిపడ్డాయి. ఇజ్రాయెల్ సైన్యానికి చెందిన కీలక కార్యాలయాలు ఆ పార్కులో ఉన్నట్లు తెలుస్తోంది. హైఫా నగరంపై ఇరాన్ చేసిన మిసైల్ దాడిలో 23 మందికి గాయాలయ్యాయి. మరోవైపు రాజధాని టెహ్రాన్, ఇరాన్‌లోని ఇతర ప్రాంతాల్లోని పలు లక్ష్యాలపై 60కు పైగా యుద్ధ విమానాలతో ఇజ్రాయెల్ దాడులు చేసింది. ఇరాన్ రక్షణ పరిశోధనా సంస్థ

తరువాయి 2లో



లోపలి పేజీల్లో

# చర్చలపై భేషజాల్లేవ్

- అవసరమైతే ఏపీ సీఎంను మేమే ఆహ్వానిస్తాం..
అదే సమయంలో తెలంగాణ హక్కులను వదులుకోం
23న మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం
బనకచర్ల ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ

# సై అంటే సై

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రకార్యాలయానికీనష్టంకలిగించింది. పశ్చిమ ఇరాన్‌లోని కెర్మన్‌షా, తబ్రీజ్ ప్రాంతాలలో ఉన్న బాలిస్టిక్ క్షిపణుల తయారీ కేంద్రాలపైనా 25 యుద్ధ విమానాలతో దాడులు చేసింది. కాస్పియన్ సముద్రం సమీపంలో ఉన్న రాస్త్ నగరంపైనా బాంబులు వేసింది. ఐరోపా నేతలతో భేటీ: ఇరాన్‌పై దాడి చేయాలా లేదా అనే విషయంపై రెండు వారాల్లో నిర్ణయం తీసుకుంటానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గురువారం పేర్కొన్న నేపథ్యంలో ఐరోపా నేతలతో సమావేశం అవ్వడానికి ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ శుక్రవారం జెనీవా చేరుకున్నారు. అక్కడ అనేక గంటలపాటు ఐరోపా, ఇరాన్ నేతల మధ్య చర్చలు జరిగాయి. ఈ చర్చల్ని మరింతగా కొనసాగించాలని ఐరోపా నేతలు అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. అదే సమయంలో ఇరాన్ అణ్వాయుధాలు కలిగి ఉండరాదని స్పష్టంగా చెప్పినట్లు బ్రిటన్ విదేశాంగమంత్రి డేవిడ్ లామీ తెలిపారు. అంతకుముందు అబ్బాస్ అరాగ్చీ విలేకరులతో మాట్లాడుతూ.. ఇజ్రాయెల్ దాడులు ఆపనంతవరకు అమెరికాతో చర్చలు జరిపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. "చర్చలు జరపాలని అమెరికన్లు కోరుకుంటున్నారు. చాలా సందేశాలు పంపారు. దాడులు ఆపనంతవరకు చర్చల ప్రసక్తే లేదని వారికి స్పష్టం చేశాం" అని చెప్పారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులకు నిరసనగా టెహ్రాన్, బీరుట్, బాగ్దాద్‌లో భారీ ప్రదర్శనలు జరిగాయి. ఇజ్రాయెల్ దాడుల్లో అరాక్ నగరంలో నిర్మాణంలో ఉన్న అణుకేంద్రానికి భారీగా నష్టం వాటిల్లిందని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ) తెలిపింది. కీలక భవనాలు దెబ్బతిన్నాయని పే ర్కొంది. ఇజ్రాయెలీ యుద్ధ విమానాలు గురువారం అరాక్ భార జల రియాక్టర్‌పై బాంబుల వర్షం కురిపించిన సంగతి తెలిసిందే.

# సాగు సాయం రూ.1.04 లక్షల కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

విడుదల చేస్తున్న సొమ్ముతో కలిపి రైతుభరోసా కింద మొత్తం రూ.21 వేల కోట్ల పెట్టుబడి సాయంతో కొత్త రికార్డు నెలకొల్పినట్లు వివరించింది. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రూ.20,616 కోట్ల పంట రుణాలను మాఫీ చేసినట్లు తెలిపింది. రైతు సంక్షేమం కోసం గత 18 నెలల్లో నిధుల వ్యయం వివరాలను 'రైతు రాజ్యం' పేరిట నివేదికగా ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. "దేశంలో ఏ రాష్ట్రం కూడా ఇంత తక్కువ కాలంలో... ఇంత పెద్దమొత్తం ఖర్చు చేసిన దాఖలాలు లేవు. గతంలో రూ.లక్ష రుణమాఫీకి నాలుగైదు విడతలుగా అరకొరగా నిధులు విడుదల చేయటంతో.. రైతులపై వడ్డీల భారం తడిసి మోపెడైంది. గత ప్రభుత్వ హయాంలో పదేళ్లయినా అన్నదాతల అప్పు తీరలేదు. మా ప్రభుత్వం తొలి ఏడాదిలోనే ఏకకాలంలో రూ.2 లక్షల్లోపు మాఫీ చేసి.. 25 లక్షల మంది రైతులను రుణ విముక్తులను చేసింది" అని నివేదికలో ప్రభుత్వం పేర్కొంది.

* **రైతు రాజ్యం నివేదికలోని ముఖ్యాంశాలు..**
* "ఈ నెల 16 నుంచి ఐదు రోజుల్లో రూ.7,310.59 కోట్ల రైతు భరోసా సొమ్మును 65.12 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేశాం. తొమ్మిది రోజుల్లో రూ.9,000 కోట్లు జమ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాలతో ఆర్థిక, వ్యవసాయ శాఖలు పంపిణీని వేగంగా పూర్తి చేస్తున్నాయి.
* వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్తు అందిస్తున్నాం. 29 లక్షల పంపు సెట్లకు ఉచిత కరెంటు సరఫరాకు రూ.16,691 కోట్ల సబ్సిడీని విద్యుత్తు సంస్థలకు చెల్లించాం.
* రూ.29,562 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేశాం. వడ్లు అమ్మిన 21.59 లక్షల మంది రైతుల ఖాతాల్లో 48 గంటల్లోనే డబ్బులు జమ చేశాం. 202324లో 15 లక్షల మంది రైతుల నుంచి 95.31 లక్షల టన్నుల ధాన్యాన్ని రూ.20,964 కోట్లతో సేకరించాం.
* సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ప్రకటించడంతో రాష్ట్రంలో సన్నాల సాగు, దిగుబడి గణనీయంగా పెరిగింది. యాసంగి సీజన్‌లో దొడ్డు రకం 80.56 లక్షల టన్నులు, సన్న రకం 46.96 లక్షల టన్నులు పండాయి.
* ఈ ఏడాది వరి సాగులో తెలంగాణ కొత్త రికార్డు నెలకొల్పింది. 2.80 కోట్ల టన్నుల ధాన్యం దిగుబడితో దేశంలో అగ్రస్థానంలో నిలిచింది.
* అకాల వర్షాలు, వరదలతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.260 కోట్ల పంట నష్టపరిహారం చెల్లించాం.
* గత కొన్నేళ్లుగా రాష్ట్రం మ్యాచింగ్ గ్రాంటు విడుదల చేయకపోవడంతో నిలిచిపోయిన 16 కేంద్ర ప్రాయోజిత పథకాల పునరుద్ధరణకు ప్రభుత్వం దాదాపు రూ.245 కోట్లు వెచ్చించింది.
* ఆయిల్‌పామ్ సాగులో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి 2025 మార్చి వరకు 60,432 ఎకరాల్లో పంట వేశారు. గతంలో గెలల ధర టన్నుకు రూ.12,534 ఉండగా.. సర్కారు చొరవతో రూ.18,748కి పెరిగింది.
* బిందు, తుంపర సేద్య పరికరాలపై పెద్దఎత్తున రాయితీ ఇస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100%, చిన్న, సన్నకారు, బీసీ రైతులకు 90%, ఇతరులకు 80% రాయితీపై డ్రిప్ పరికరాలు.. రైతులందరికీ 75% రాయితీపై స్ప్రింక్లర్లను అందిస్తున్నాం. 2023 డిసెంబరు నుంచి 40,265 మంది రైతులకు రూ.282 కోట్ల విలువైన పరికరాలను అందించాం" అని నివేదికలో రాష్ట్ర ప్రభుత్వం వివరించింది.

# కాళేశ్వరంపై మంత్రివర్గ నిర్ణయాల వివరాలు.. 30లోగా అందజేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

చేవెళ్లలో భాగంగా ఎల్లంపల్లి నుంచి నీటిని మళ్లించే పనులకు టెండరు పిలవగా, పునరాకృతి తర్వాత కాలువల సామర్థ్యం పెరగడంతో పనులను గుత్తేదారులకు ఎలా అప్పగించాలన్నదానిపై ముగ్గురు మంత్రులతో ఉపసంఘాన్ని అప్పటి ప్రభుత్వం నియమించింది. ఉప సంఘం ప్యాకేజీల వారీగా వివరాలు సేకరించి మొదట చేపట్టిన పనితో కలిసిపోయి ఉండి... విడతీయడానికి వీలుకాకపోతే అప్పటికే ఉన్న గుత్తేదారుకు ఇవ్వాలని, ప్రత్యేకంగా టెండర్ పిలవడానికి అవకాశం ఉన్నవాటికి టెండరు ప్రక్రియ చేపట్టాలని సూచించింది. ప్రతి ప్యాకేజీలో ఈ వివరాలు స్పష్టంగా పేర్కొంటూ నివేదిక ఇచ్చింది. ట్రాన్స్‌పరెన్సీ ప్రైస్ డిస్కవరీ, స్విస్ ఛాలెంజ్ పద్ధతిలో టెండర్ ప్రక్రియకు సిఫార్సు చేసినట్లు తెలిసింది. ఉదాహరణకు 14వ ప్యాకేజీలో కొండపోచమ్మ రిజర్వాయర్ నిర్మాణంతోపాటు అప్రోచ్ ఛానల్, కాలువ, సొరంగం, పంపుహౌస్ ఉన్నాయి. వీటి సామర్థ్యం పెరిగిన పంపుహౌస్‌లో సగం పని ఒకరు, ఇంకో సగం మరొకరు చేయడం వీలుకాదు కాబట్టి ఉన్న గుత్తేదారుకే 2015 16 ధరలతో ఇవ్వాలని సిఫార్సు చేసింది. కొండపోచమ్మ రిజర్వాయర్ సామర్థ్యం మొదట ఒక టీఎంసీ కాగా ఏడు టీఎంసీలకు (తదుపరి 15 టీఎంసీలకు) పెంచారు. అదనపు ఆయకట్టు ఉన్నందున ఈ పనికి టెండరు పిలవడం లేదా ట్రాన్స్‌పరెన్సీ ప్రైస్ డిస్కవరీ పద్ధతిని అనుసరించాలని సూచించింది. కొన్ని పనులకు స్విస్‌ఛాలెంజ్ పద్ధతిని సూచించినట్లు తెలిసింది. ఉప సంఘం నివేదికను మంత్రివర్గంలో ఆమోదించినట్లు తెలిసింది. 21వ ప్యాకేజీ పనిని స్విస్ ఛాలెంజ్ పద్ధతిలో పిలవగా ఆర్థిక శాఖ దీనిని తిరస్కరించినట్లు సమాచారం. దీంతో ఈ పద్ధతికి స్వస్తిపలుకుతూ నీటిపారుదల శాఖ మెమో జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. టెండర్ ప్రక్రియ మంత్రివర్గం ఆమోదం ప్రకారమే జరిగిందా లేక భిన్నంగా జరిగిందా అనేది పరిశీలించి కమిషన్‌కు నివేదించనున్నట్లు తెలిసింది.

# ట్రంప్ అమెరికా ఆహ్వానాన్ని తిరస్కరించా

(మొదటిపేజీ తరువాయి)

సందర్భంగా శుక్రవారం భువనేశ్వర్‌లో నిర్వహించిన సభలో ప్రధాని మోదీ ప్రసంగిస్తూ ఈ విషయం చెప్పారు. 'కెనడా నుంచి తిరిగి వెళ్లే సమయంలో అమెరికా రావాలని పిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపా. ట్రంప్ ఆహ్వానాన్ని సున్నితంగా నిరాకరించా. పరమపవిత్ర జగన్నాథుడు వెలసిన ఒడిశా రాష్ట్రానికి వెళ్లాల్సి ఉందని చెప్పాను. ఆ భగవంతుడిపై భక్తే నన్ను ఇక్కడకు తీసుకొచ్చింది' అని ప్రధాని మోదీ వెల్లడించారు. అమెరికా వెళ్లడం కన్నా ఒడిశా సందర్శనే తనకు ముఖ్యమని పేర్కొన్నారు. పూరీ జగన్నాథ ఆలయంలోని రత్న భాండాగారాన్ని తెరవాలన్న ప్రజల డిమాండ్‌ను భాజపా ప్రభుత్వం నెరవేర్చిందని మోదీ చెప్పారు. కాంగ్రెస్ పాలనలో దేశంలో సుపరిపాలనకు చోటు లేకపోయిందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ఒడిశా అవినీతి కేంద్రంగా నిలిచిందని ఆరోపించారు. భాజపా ప్రభుత్వాలున్న రాష్ట్రాల్లో సామాజిక ఆర్థికాభివృద్ధిలో నవశకం ప్రారంభమైందన్నారు. జీ7 సదస్సు సందర్భంగా ట్రంప్, మోదీ కెనడాలో భేటీ కావాల్సి ఉన్నప్పటికీ అమెరికా అధ్యక్షుడు అర్ధంతరంగా వెళ్లిపోవడంతో సాధ్యపడలేదు.

* **అంబేడ్కర్‌ను వాళ్లు అవమానిస్తే... నేను గుండెల్లో పెట్టుకున్నాను**

సివాన్: వారసత్వ రాజకీయాలకు డా.బి.ఆర్. అంబేడ్కర్ వ్యతిరేకి అని ప్రధాని మోదీ తెలిపారు. అందువల్లే ఆర్జేడీ, దాని మిత్రపక్షాలకు అంబేడ్కర్ అంటే ఇష్టం ఉండదని ఆరోపించారు. బిహార్‌లోని సివాన్‌లో శుక్రవారం నిర్వహించిన సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. అధికారం కోసం, తమ సొంత కుటుంబాలను ప్రోత్సహించడంపైనే కాంగ్రెస్, ఆర్జేడీ దృష్టి పెడతాయంటూ విమర్శలు సంధించారు. ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ జన్మదినం సందర్భంగా ఆయన నివాసంలో అంబేడ్కర్ చిత్రపటానికి అవమానం జరిగిందనే విమర్శలను మోదీ ప్రస్తావించారు. 'దళితులంటే వారికి చిన్నచూపు కనుక ఇంతవరకూ క్షమాపణలు తెలపలేదు. బాబాసాహెబ్ నా గుండెల్లో ఉన్నారు. అందుకే ఆయన చిత్రపటాన్ని నా ఛాతీకి దగ్గరగానే ఉంచుతాను' అని మోదీ తెలిపారు. లాలూ పేరు ప్రస్తావించకుండానే ఈ విమర్శలు చేశారు.

# నూతన శతకారంభం...

(మొదటిపేజీ తరువాయి)

రాహుల్‌ను పరీక్షించారు. కానీ భారత ఆటగాళ్లు ఏమాత్రం తొందరపడలేదు. బంతి గతి తప్పినప్పుడు మాత్రమే షాట్లు ఆడారు. రాహుల్ ముచ్చటైన కవర్‌డ్రైవ్‌లు ఆడితే.. యశస్వి బ్యాక్‌ఫుట్ కట్‌షాట్లు, డ్రైవ్‌లతో స్కోరు పెంచాడు. కాసేపట్లో లంచ్ అనగా ఇంగ్లాండ్.. టీమ్‌ఇండియాను దెబ్బ కొట్టింది. మొదట కార్స్ బౌలింగ్‌లో ఆఫ్ స్టంప్ లోగిలిలో పడిన బంతిని వెంటాడిన రాహుల్.. స్లిప్‌లో రూట్‌కు క్యాచ్ ఇచ్చాడు. తర్వాతి ఓవర్లో టీమ్‌ఇండియాకు మరో ఎదురు దెబ్బ తగిలింది. ఐపీఎల్‌లో అదరగొట్టి.. ఈ మ్యాచ్‌లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన సాయి సుదర్శన్ (0) పేలవంగా ఔటయ్యాడు. స్టోక్స్ బౌలింగ్‌లో వికెట్‌కీపర్ జేమి స్మిత్‌కు దొరికిపోయాడు. స్టోక్స్ లెగ్‌సైడ్ వేసిన బంతిని గ్లాన్స్ ఆడే ప్రయత్నంలో సుదర్శన్ వెనుదిరిగాడు. దీంతో స్వల్ప వ్యవధిలో రెండు వికెట్లు పడిన నిరాశలో భారత్.. ప్రత్యర్థిని దెబ్బ తీశామన్న ఆనందంలో ఇంగ్లాండ్ లంచ్‌కు వెళ్లాయి. గేరు మార్చారు: తక్కువ సమయంలో రెండు వికెట్లు పడినా.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, యశస్వి రక్షణాత్మకంగా ఆడలేదు. శుభ్‌మన్ ఒత్తిడి లేకుండా క్రీజులో స్వేచ్ఛగా కదులుతూ షాట్లు ఆడాడు. వోక్స్ వేసిన ఓ ఓవర్లో అతడు మూడు ఫోర్లు కొట్టాడు. ఈ క్రమంలో ఆడిన ఓ స్ట్రెయిట్‌డ్రైవ్ అద్భుతం. మరోవైపు 45 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద కార్స్ బౌలింగ్‌లో యశస్వి ఎల్బీగా ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. మిడిల్ స్టంప్‌కు నేరుగా కార్స్ వేసిన యార్కర్ యశస్వి కాలికి తగిలింది. దీంతో అతడు ఎల్బీగా వెనుదిరగడం ఖాయంగా కనిపించింది. సమీక్షలో కార్స్ నోబాల్ వేసినట్లు తేలడంతో యశస్వికి జీవనదానం లభించింది. అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ యశస్వి అర్ధసెంచరీ చేశాడు. ఈ మైలురాయి అందుకున్నాక దూకుడు పెంచాడు. వోక్స్ ఓవర్లో మూడు ఫోర్లు బాదిన యశస్వి.. టంగ్ బంతిని స్టాండ్స్‌లోకి కొట్టాడు. ఇంకోవైపు జోరు కొనసాగించిన శుభ్‌మన్.. టంగ్ బౌలింగ్‌లో ఫోర్‌తో 56 బంతుల్లోనే అర్ధసెంచరీ అందుకున్నాడు. కార్స్ ఓవర్లో మూడు ఫోర్లు కొట్టి 99కి చేరుకున్న యశస్వి.. తర్వాతి బంతికి సింగిల్‌తో ఇంగ్లాండ్‌లో తొలి సెంచరీ నమోదు చేశాడు. టెస్టుల్లో అతడికిది అయిదో సెంచరీ. 96 బంతుల్లో అర్ధసెంచరీ చేసిన ఈ లెఫ్ట్ హ్యాండర్ మరో 48 బంతుల్లోనే మూడంకెల మార్కు అందుకోవడం విశేషం. టీ విరామానికి భారత్ 215/2తో బలమైన స్థితిలో నిలిచింది.

ఆఖర్లో ఇద్దరూ..: సెంచరీ సాధించి జోరు మీదున్న జైస్వాల్‌ను టీ విరామం అనంతరం స్టోక్స్ పెవిలియన్ చేర్చాడు. ఒక గుడ్ లెంగ్త్ బంతిని ఆడే ప్రయత్నంలో యశస్వి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. దీంతో మూడో వికెట్ భాగస్వామ్యానికి 129 పరుగుల వద్ద తెరపడింది. ఈ స్థితిలో రిషబ్ పంత్‌తో కలిసి శుభ్‌మన్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ క్రమంలో తన శైలిలో ఆఫ్‌సైడ్ షాట్లతో అలరించిన శుభ్‌మన్ సెంచరీ చేసేందుకు తొందరపడలేదు. ఒక ఎండ్‌లో స్పిన్, మరో ఎండ్‌లో పేస్‌తో ఇంగ్లాండ్ పరీక్షించినా ఏకాగ్రత కోల్పోలేదు. 98 పరుగుల వద్ద రనౌట్ అయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్న శుభ్‌మన్.. టంగ్ బౌలింగ్‌లో ఫోర్‌తో టెస్టుల్లో ఆరో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. శతకం తర్వాత కూడా శుభ్‌మన్ జోరు కొనసాగించడం.. పంత్ కూడా తనశైలిలో దూకుడుగా షాట్లు ఆడడంతో భారత స్కోరు పరుగులెత్తింది. వోక్స్ బౌలింగ్‌లో ఓ స్లాగ్‌స్వీప్ ఫోర్‌తో పంత్ అర్ధసెంచరీ అందుకున్నాడు. అభేద్యమైన నాలుగో వికెట్‌కు శుభ్‌మన్‌పంత్ జంట 138 పరుగులు జత చేసింది.

# రూ.100 కోట్లతో అంబేడ్కర్ పరిశోధన కేంద్రం

* **ఆరు నెలల్లో 'బ్రిడ్జ్'ను ప్రారంభించేందుకు కసరత్తు**

హైదరాబాద్: స్వతంత్ర భారతదేశంలో చాలా రాష్ట్రాలు.. ప్రాంతాల్లో కొనసాగుతున్న సామాజిక అసమానతలు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును అధ్యయనం చేసేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అంతర్జాతీయ స్థాయిలో పరిశోధన కేంద్రాన్ని నిర్మించనుంది. జూబ్లీహిల్స్‌లోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో రెండు ఎకరాల విస్తీర్ణంలో రూ.100 కోట్లతో ఇది రూపుదిద్దుకోనుంది. రాష్ట్ర ప్రభుత్వం నిధులు సమకూర్చనుంది. వచ్చే ఆరునెలల్లో ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీనికి 'బ్రిడ్జ్' (బీఆర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డైలాగ్ ఆన్ గవర్నెన్స్, ఈక్విటీ) అని పేరు పెట్టారు. ఈ కేంద్రం కార్యకలాపాల నిర్వహణకు ఒక గవర్నింగ్ బోర్డు, సలహా మండలిని ఏర్పాటు చేశారు. సలహామండలి అధ్యక్షుడిగా ముఖ్యమంత్రి, సమన్వయకర్తగా అంబేడ్కర్ వర్సిటీ వీసీ, సభ్యులుగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పరిశోధకులు, న్యాయనిపుణులు ఉంటారు. గవర్నింగ్ బోర్డు ఛైర్మన్‌గా ఉపముఖ్యమంత్రి వ్యవహరిస్తారు. బోర్డులో ఆర్థిక, ఉన్నత విద్యాశాఖల ముఖ్య కార్యదర్శులు, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి శాఖల ముఖ్యకార్యదర్శులు, వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్, ముగ్గురు సంచాలకులు ఉంటారు. ప్రజాప్రయోజన అంశాలు, సాంఘిక దురాచారాలు, అక్షరాస్యత ఇలా వివిధ అంశాలపై అధ్యయనం చేయాలనుకున్న పరిశోధకులు, నిపుణులకు ఈ కేంద్రం నిధులు సమకూర్చనుంది. రాజ్యాంగ విధివిధానాల అమలు, సామాజిక న్యాయం వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనుంది. గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనుంది. రాజ్యాంగంలో పొందుపరిచిన సూత్రాలు, విలువలు, నైతిక ప్రమాణాల అనుసరణపై విస్తృత అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యం. విస్తృత పరిశోధనలకు వీలుగా కొలంబియా విశ్వవిద్యాలయం, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌తో ఒప్పందాలు కుదుర్చుకోనుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యాకేంద్రంగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, విధివిధానాలపై పరిశోధనలు నిర్వహించే సంస్థగా దీనిని రూపొందించేందుకు నిర్వాహకులు ప్రణాళికలను సిద్ధం చేశారు.




# బ్యాంకింగ్ వ్యవస్థలోనే లోపాలున్నాయి

హైదరాబాద్: దేశంలోని బ్యాంకింగ్ వ్యవస్థలో లోపాలున్నాయని ఓ కేసు విచారణ సందర్భంగా హైకోర్టు వ్యాఖ్యానించింది. బ్యాంకు అధికారులు వేల కోట్ల రూపాయల రుణాలను మంజూరు చేస్తున్నారని, తీసుకున్న వారు ఎగవేస్తుంటే పట్టించుకోవడంలేదని, అదే సమయంలో సామాన్యులపై వివిధ ఛార్జీల పేరుతో భారం మోపుతున్నారని ఆక్షేపించింది. మంజూరుచేసిన అధికారులపైనే వసూలు చేయాల్సిన బాధ్యత పెడితే.. వ్యవస్థలో కొంతయినా మార్పు వస్తుందని పేర్కొంది. హైదరాబాద్ సనత్‌నగర్ ఎస్‌బీఐ బ్రాంచి అధికారులు ముందస్తు చెల్లింపుల పేరుతో, ఎలాంటి సమాచారం లేకుండా ఛార్జీలను మినహాయించుకోవడాన్ని సవాలుచేస్తూ ఉత్తమ్ ధాతు అండ్ ఇస్పాత్ ప్రైవేట్ లిమిటెడ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ సి.వి. భాస్కర్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, ఆస్తులను హామీగా ఉంచి తీసుకున్న రుణాన్ని ముందుగానే చెల్లించినందుకుగాను రూ.1.16 కోట్లు కంపెనీ ఖాతా నుంచి బ్యాంకు మినహాయించుకుందన్నారు. ఇది ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధమని, జరిమానాతోపాటు వడ్డీతోసహా తిరిగి ఇచ్చేలా ఆదేశాలు జారీచేయాలని కోరారు. వాదనలను విన్న న్యాయమూర్తి బ్యాంకింగ్ వ్యవస్థ లోపభూయిష్ఠంగా ఉందని పేర్కొంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'సాధారణ, మధ్య తరగతి ప్రజలు రుణాలు తీసుకుంటే ఛార్జీల పేరుతో బ్యాంకులు భారం వేస్తున్నాయి. రుణం ముందు తీర్చేసినా, జాప్యం చేసినా జరిమానాల పేరుతో సామాన్యుల నడ్డి విరుస్తున్నాయి. తీసుకున్న గృహరుణం పూర్తయిన తర్వాత.. సంబంధిత డాక్యుమెంట్ తీసుకునేటప్పుడు కూడా ఛార్జీలు చెల్లించాల్సి వస్తోంది. అదే సమయంలో రూ.వేల కోట్ల రుణం తీసుకుని ఎగవేసిన వారి నుంచి వసూలు చేయలేకపోతున్నాయి. మంజూరు చేసిన బ్యాంకు అధికారే వసూలు బాధ్యత కూడా తీసుకోవాలనే నిబంధన ఉంటే రుణాలు సక్రమంగా మంజూరవుతాయి' అని న్యాయమూర్తి పేర్కొన్నారు. ప్రస్తుత కేసులో ఆర్‌బీఐతోపాటు బ్యాంకు అధికారుల వివరణను పరిశీలించాల్సి ఉందన్నారు. ప్రతివాదులైన ఆర్‌బీఐతోపాటు ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీలకు నోటీసులు జారీ చేస్తూ.. కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేశారు.

# ఇజ్రాయెల్‌కు అంత సామర్థ్యం లేదు.. ట్రంప్ కీలక వ్యాఖ్యలు

ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య పరస్పర దాడులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టెల్‌అవీవ్‌ను ఉద్దేశిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ సాయం లేకుండా ఫోర్డ్‌లోని భూగర్భ అణుకేంద్రాన్ని నాశనం చేసే సామర్థ్యం ఇజ్రాయెల్‌కు లేదన్నారు. శుక్రవారం (స్థానిక కాలమానం ప్రకారం) న్యూజెర్సీలో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్ ఇప్పటివరకు జరిపిన దాడుల్లో గణనీయమైన సైనిక లాభాలను సాధించిందని ట్రంప్ పేర్కొన్నారు. అయితే, అమెరికా సాయం లేకుండా ఇరాన్‌కు చెందిన ఫోర్డ్ భూగర్భ అణుకేంద్రాన్ని నాశనం చేసే సామర్థ్యం టెల్‌అవీవ్‌కు లేదు.

# నిత్యం యోగా చేస్తే మానసిక ఉల్లాసాన్ని పొందుతారు



కాప్రా, ప్రజాస్ఫూర్తి : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మన ప్రధాన మంత్రి మోది పిలుపు మేరకు భాష్యం విద్యా సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ తన విద్యాసంస్థలో మూడు రోజుల ప్రణాళికను రూపొందించారు. ఈ ప్రణాళిక ప్రకారం మొదటి రోజు 19వ తేదిన ప్రైమరీ విద్యార్థులకు, 2వ రోజు 20వ తేది నాడు హైస్కూల్ విద్యార్థులకు 21 వ తేది నాడు ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు యోగా గురించి అవగాహన కల్పిస్తూ "కామన్ యోగా కార్యక్రమం" నిర్వహించడం జరుగుతుంది. దీనిలో భాగంగా డా॥ ఏ.యస్.రావు నగర్ భాష్యం పాఠశాల విద్యార్థులు శుక్రవారం భారీ ర్యాలి నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలి కి ముఖ్య అతిథిగా కుషాయిగూడ సీఐ భాస్కర్ రెడ్డి విచ్చేసి పచ్చ జెండాను ఊపి ర్యాలిని ప్రారంభించారు. ర్యాలీని పాఠశాల నుండి ప్రారంభమై ప్రధాన రహదారుల గుండా రాధిక కూడలి నుండి తిరిగి పాఠశాల వరకు నిర్వహించారు. ఈ ర్యాలీలో విద్యార్థులు పాల్గొని యోగా యొక్క గొప్పతనాన్ని తెలుపుతూ మంచి మంచి నినాదాలు, సూక్తులు ఇచ్చారు. భాష్యం విద్యా సంస్థల సీఈవో చైతన్య మాట్లాడుతూ భాష్యం విద్యాసంస్థలు విద్యతో పాటు సమాజ శ్రేయస్సుకై ఇటువంటి కార్యక్రమాలు చాలా ఉత్సాహంగా నిర్వర్తిస్తుందని తెలిపారు. సమాజంలోని ప్రతి వ్యక్తి యోగాని దినచర్యలో భాగంగా చేసుకుంటే తప్ప కుండా మానసిక ఉల్లాసాన్ని పొందగలుగుతారు. తద్వారా వారు ఎంతో ఆరోగ్యంగా జీవించగలుగుతారు అని తెలియ జేసారు. భాష్యం పాఠశాల హై స్కూల్ విద్యార్థుల యోగా కార్యక్రమాన్ని భాష్యం పాఠశాల గ్రౌండ్లో చాలా చక్కగా ప్రదర్శించడం జరిగింది. ఈ ప్రదర్శనని ,ర్యాలీని విజయ వంతం చేసిన విదార్థులకు జెడ్ ఈఓ మార్కండేయులు, ప్రిన్సిపాల్స్ బహుమతులతో అభినందించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథులుగా భాష్యం పాఠశాలల ప్రిన్సిపాల్స్ అమరేశ్వర్ రావు, స్వాతి, వనిత మేరి, పాఠశాల సిబ్బంది పాల్గొని ఈ కార్యక్రమానికి విజయ వంతం చేసిన వారందరికి అభినందనలు తెలియ జేసారు.

## సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల మధ్య ఘర్షణలను సృష్టిస్తున్న సివిల్ అధికారులు

*** సివిల్ అధికారులను హెచ్చరించిన ఏఐటీయూసీ నాయకులు...**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి కొత్తగూడెం కార్పొరేటు ఇల్లందు బంగ్లోస్ వద్ద జరుగుతున్న ఆందోళన,నిరసనలకు సింగరేణి సివిల్ అధికారులే బాధ్యులని, అత్యంత బాధ్యతారాహిత్యంగా తప్పుడు పద్ధతిలో టెండర్లను పిలవడం వల్ల రైటర్ బస్తి,బంగ్లోస్ కాంట్రాక్ట్ కార్మికులు మధ్య ఘర్షణలను సృష్టించడానికి సివిల్ అధికారులు ప్రయత్నించడం సరికాదని, తక్షణమే తమ వైఖరిని మార్చుకోవాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య ఉపాధ్యక్షులు,కే డబ్ల్యూ కిష్టాఫర్ లు హెచ్చరించారు. శుక్రవారం నాడు బంగ్లో స్ వద్ద సివిల్ కాంట్రాక్ట్ కార్మికులు వేరే ప్రాంతాల నుంచి వస్తున్న పోటీ కార్మికులను అడ్డుకొని నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐటియుసి నాయకులు మాట్లాడుతూ తమ యూనియన్ ఆధ్వర్యంలో సింగరేణి అధికారులకు రిప్రజెంటేషన్ చేసినప్పటికీ పట్టించుకోకుండా తప్పుడు పద్ధతిలో వాహనాలలో పోటీ కాంట్రాక్ట్ కార్మికులను దొంగతనంగా తీసుకురావడం సరికాదని అన్నారు. తప్పుడు నిర్ణయాలను తీసుకొని వాటిని సరి చేయకుండా వారి నిర్ణయాలను సమర్థించుకుంటూ కాంట్రాక్ట్ కార్మికుల మధ్య ఘర్షణ సృష్టించడానికి చేస్తున్న ప్రయత్నాలను తక్షణమే విరమించుకోవాలని కోరారు. గత వారం రోజుల నుండి కాంట్రాక్ట్ కార్మికులు ఆందోళన చేస్తున్నప్పటికీ సివిల్ అధికారులు నిర్లక్ష్యం వివరించడం సరికాదని విమర్శించారు. ఇప్పటికైనా తప్పుడు పద్ధతిలో పిలిచిన టెండర్లను సరిచేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఇల్లందు బంగ్లో స్ వద్ద జరిగే కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన పోరాటాలకు సివిల్ అధికారులే పూర్తి బాధ్యత వహించవలసి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి రంజిత్,కృష్ణమూర్తి, రాజు,శంకర్,నాగమ్మ, సురేష్,ఆదిలక్ష్మి,సుశీల,విజయ్ సుజాత,మాధవి,కళ్యాణ్, లక్పతి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## పద్మారావ్ నగర్ అభివృద్ధి చేస్తా

**: కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి**



ప్రజాస్ఫూర్తి, కాప్రా : కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి డివిజన్ పరిధిలోని పద్మారావ్ నగర్ కాలనీలో కాలనీ వాసులు, అధికారులతో పర్యటించారు. ఈ సందర్భంగా స్వర్ణరాజ్ శివమణి మాట్లాడుతూ కాలనీ పర్యటనలో పద్మారావ్ నగర్ కాలనీ రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తెలిపిన అంతర్గత రోడ్లు, పార్కుల అభివృద్ధి మరియు శానిటేషన్ పనులను చేయిస్తానని హామీయిచ్చామన్నారు. డివిజన్ అభివృద్ధి కొరకు అహర్నిశలు కృషి చేస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా పద్మారావ్ నగర్ కాలనీ రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జి హెచ్ ఎమ్ సి కాప్రా ఏ ఈ సూరజ్ , డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కొబ్బనూరి నాగ శేషు , మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఏ ఎమ్ సి డైరెక్టర్ పూర్ణయాదవ్ , మాజీ డైరెక్టర్ కొబ్బనూరి నాగరాజు , సీనియర్ కాంగ్రెస్ నాయకులు పవన్ కుమార్, రిజ్వాన్ ఖాన్, రాకేష్ యాదవ్,శ్రీధర్ రెడ్డి, జి సత్యనారాయణ, పి నరేందర్ గౌడ్,వినోద్, ఆకుల సంతోష్, సోంనాథ్, షాబుద్ధిన్, మూర్తజా, ప్రదీప్, సిద్దిక్, రాజన్ తదితరులు మరియు పద్మారావు నగర్ కాలనీ అధ్యక్షులు రామకృష్ణ రెడ్డి, సెక్రటరీ వెంకటేశ్వర్ రావ్ మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## గొందళి సమాజ్ ను బీసీ జాబితాలో చేర్చాలని వినతి



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి): గొందళి సమాజ్ ను బీసీ జాబితాలో చేర్చాలని తెలంగాణ రాష్ట్ర గొందళి సమాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏక్ నాథుడు సంఘం సభ్యులు,గొందలి సంఘం కళాకారులతో కలసి శుక్రవారం ఖైరతాబాద్ లోని బీసీ కమిషన్ కార్యాలయంలో చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ ను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. గొందళి సమజ్ సంఘం పడుతున్న ఇబ్బందులను బీసీ కమిషన్ ముందు గొందళి సంఘం కళాకారులతో వివరంగా ఆటపాటలతో చూపించిన గొందళి సమాజ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏక్నాద్ దున్గే ఇప్పుడిప్పుడే తమ పిల్లలు పై చదువులు చదువుతున్నారు పిల్లల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం గొందళి సమాజ సంఘం ను బీసీ జాబితాలో చేర్చడం వల్ల వారికి క్యాస్ట్ సర్టిఫికెట్లు, కులం సంఘం భవనాలు తదితర సర్టిఫికెట్లు ప్రభుత్వ నుండి అందుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ విన్నపమును దృష్టిలో పెట్టుకొని తమ కులమును బీసీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వానికి విన్నవించారు. బీసీ జాబితాలో తమ కులం లేకపోవడంతో తమ పిల్లలు, తము చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు చాలా ఏళ్లుగా తమ గోడు వెల్లబోసుకుంటున్నా మని గత ప్రభుత్వంలో సైతం వినతి పత్రాలు అందజేసిన ఎలాంటి స్పందన లేకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా తమ సంఘమును బీసీ జాబితాలో చేర్చి తమ సమస్యలు పరిష్కరించాలన్నారు. సానుకూలంగా స్పందించిన ,బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ సమస్యను రాష్ట్ర ప్రభుత్వాన్ని దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గొందళి సమజ్ సంఘం సభ్యులు, కళాకారులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయ ప్రారంభోత్సవం

యాదాద్రి భువనగిరి, (ప్రజాస్ఫూర్తి) : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని రాయగిరి రోడ్డుకు ఎస్ ఎల్ ఎన్ ఎస్ డిగ్రీ కళాశాల ఎదురుగా , పాత వివేరా హోటల్ ఆవరణలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా శాఖ కార్యాలయాన్ని శనివారం స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షులు ఎం హనుమంతరావు డిసిపి అక్షాంశ్ యాదవ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం మనోహర్లు కలిసి ప్రారంభిస్తారు. ఉదయం 9:30 గంటలకు తొలుత ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకొని యోగా కార్యక్ర మాన్నీ ప్రారంభిస్తారు. ఆ తదుపరి ఆర్ట్ ఆఫ్ లివింగ్ తెలంగాణ భువనగిరి శాఖ తోడ్పాటుతో మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తారు. ఈ శిబిరంలో రెడ్ క్రాస్ జిల్లా, డివిజన్, భువనగిరి పట్టణ, మండల శాఖల ప్రతినిధులు రక్తదానం చేస్తారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా శాఖ జిల్లాలో విస్తృతమైన సేవా కార్యక్రమాలు చేపడుతుంది. ముఖ్యంగా గ్రామాలలోని నిరుపేదలైన వృద్ధుల కోసం తమ సంచార వాహనం ద్వారా ఇప్పటికే సుమారు 125 ఉచిత వైద్య శిబిరాలను గ్రామాలలో ఏర్పాటుచేసి వందలాదిమంది వృద్ధులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందించాము. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో యువతకు రక్తదానం మీద అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ రక్తదాన శిబిరాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నాం. ఈ రక్తదాన శిబిరాలు నిర్వహించడంలో తెలంగాణ రాష్ట్రంలోనే యాదాద్రి భువనగిరి జిల్లా శాఖ ముందుందని తెలుపుటకు సంతోషిస్తున్నాము. రక్తదాన శిబిరాలను నిర్వహించడంలో రెండు పర్యాయాలు మన జిల్లా కలెక్టర్ అనితా రామచంద్రన్, జిల్లా చైర్మన్ డాక్టర్ జి లక్ష్మీ నరసింహ రెడ్డి , గవర్నర్ అవార్డులు అందుకున్నారు. ఎక్కువ సార్లు రక్తదానం చేసిన ప్రతినిధులు పలువురు గవర్నర్ అవార్డులు అందుకున్నారు. రక్తదానాలను నిర్వహించి, ప్రోత్సహించడంలో మా డివిజన్ చైర్మన్, వివేరా హోటల్ అధినేత సద్ది వెంకటరెడ్డి కూడా గవర్నర్ అవార్డు అందుకోవడం విశేషం. ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా రెడ్ క్రాస్ పేదలకు తార్పాలిన్లు అందజేస్తుంది అగ్ని ప్రమాదాలు సందర్భంగా బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు ఆర్థిక, వస్తురూపేన సహాయం అందిస్తుంది. ముఖ్యంగా యువతను సేవా మార్గంలో నడిపించాలన్న లక్ష్యంతో కళాశాలలో యూత్ రెడ్ క్రాస్ ,పాఠశాలల్లో జూనియర్ రెడ్ క్రాస్ కమిటీలను ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తుంది. పాఠశాలల్లో, కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, గుండె నొప్పులు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన అటువంటి చర్యలు మీద సిపిఆర్ అవగాహన కార్యక్రమాలు చేపడుతుంది. ప్రథమ చికిత్సల మీద అవగాహన కల్పిస్తుంది. ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా విరాళాలు సేకరించి పేదలను ఆదుకుంటుంది. పౌరపాలికల్లోని పారిశుద్ధ్య సిబ్బందికి యూనిఫాములు సబ్బులు శానిటైజర్లు తదితరాలను అందిస్తుంది.

## బార్ కౌన్సిల్ మెంబర్గా బరిలో ఉన్న న్యాయవాది నర్రి స్వామికి ఘన సన్మానం



యాదాద్రి భువనగిరి, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ రాష్ట్రంలో జరగబోయే తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో బరిలో ఉండే న్యాయవాది తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు లాయర్స్ ఫోరం ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అఖిల భారతీయ న్యాయవాద సంయుక్త సంఘటన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్రి స్వామి కుర్మని చౌటుప్పల్ బార అసోసియేషన్ అధ్యక్షుడు బాల్య వెంకటాచలం మరియు బార్ అసోసియేషన్ సభ్యులు శాలువా కప్పి మెమొంటోతో సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా చౌటుప్పల్ కోర్టు అసోసియేషన్ అధ్యక్షులు బాల్య వెంకటాచలం మాట్లాడుతూ నర్రి స్వామి రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూనే సామాజిక న్యాయం కోసం ఉద్యమిస్తున్న సామాజిక చైతన్యం ఉన్న రాజకీయ చైతన్యం కలిగిన న్యాయవాది చౌటుప్పల్ కోర్టు బార్ అసోసియేషన్ లో ఎగ్జిక్యూటివ్ నెంబర్ గా మరియు లైబ్రరీ సెక్రటరీగా గెలుపొంది తన వంతు సేవలను అందించాడు కాబట్టి మా అసోసియేషన్ న్యాయవాదుల జనరల్ బాడీ మీటింగ్లు అనంతరం నర్రి స్వామిని గౌరవంగా సన్మానించడం జరిగిందన్నరూ వారి బార్ కౌన్సిల్ మెంబర్ గా బరిలో ఉంటే చౌటుప్పల్ బార్ అసోసియేషన్ ఉంచి మద్దతు తెలియజేస్తునన్నము అన్నారు ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ మహిపాల్ రెడ్డి, ట్రెజరర్ రమేష్ జాయింట్ సెక్రెటరీ స్వాతి, శేఖర్, శ్రీశైలం యాదవ్, కార్యవర్గ సభ్యులు కయుంపాషా, శివ కుమార్ ,మాజీ అధ్యక్షులు ఉడుగు శ్రీనివాస్ గౌడ్ , నరసింహారెడ్డి మాజీ ఉపాధ్యక్షుడు తాడూరి పరమేష్, మాజీ జనరల్ సెక్రెటరీ పాల పరమేష్ సీనియర్ న్యాయవాదులు రాధాకిషన్ రావు, తడక మోహన్ సత్తిరెడ్డి, వెంకటయ్య, శ్రీకాంత్, శ్రీశైలం అనేకమంది న్యాయవాదులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి రూ.కోటి టాటా ఇన్సూరెన్స్ చెక్కు అందజేత




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి టాటా ఇన్సూరెన్స్ ద్వారా మంజూరైన రూ.కోటి క్లెయిమ్ చెక్కును జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు చేతులమీదుగా అందించారు. శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ కానిస్టేబుల్ తన్నీరు అనిల్ కుమార్ ఇటీవల మణుగూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడని, మృతుడు టాటా లైఫ్ ఇన్సూరెన్స్‌లో టెర్మ్ పాలసీ తీసుకోవడం వలన అతనికి రూ. కోటి యాక్సిడెంటల్ డెత్ ఇన్సూరెన్స్ క్లెయిమ్ అయిందని తెలిపారు. ప్రతీ ఒక్కరు ఇన్సూరెన్స్ చేసుకోవడం వల్ల అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు వారి కుటుంబానికి ఆర్థిక భరోసా లభిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కొత్తగూడెం బ్రాంచి మేనేజర్ జక్కుల సతీష్ మాట్లాడుతూ అనిల్ కుమార్ సెప్టెంబర్ 2022న టాటా ఏఐఏ ద్వారా వార్షిక ప్రీమియంగా రూ.28,761/- చెల్లించి టర్మ్ పాలసీ తీసుకున్నారని, గతి డిసెంబర్‌లో మణుగూరు మండలం తోగ్గుడెం గ్రామం దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన ప్రాణాలు కోల్పోయారన్నారు. ఆయన నామినీగా ఉన్న తన్నీరు నాగలక్ష్మి అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించగా, క్లెయిమ్ మొత్తం ఒక కోటి రూపాయలు వారి ఖాతాలోకి జమ చేసినట్లు వివరించారు. పాలసీ తీసుకున్న మూడు సంవత్సరాలలోనే అనుకోని రోడ్డు ప్రమాదంలో మరణించినప్పటికీ కోటి రూపాయల ఇన్సూరెన్స్ డబ్బులను నామిని అయినటువంటి తన్నీరు నాగలక్ష్మి అకౌంట్లో జమ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఎంప్లాయీస్ రాహుల్ వెంకటేష్, టాటా ఏఐఏ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కొచ్చెర్ల కమలరాణి, తదితరులు పాల్గొన్నారు.

## కాలనీలలో మౌళిక వసతుల కల్పనకు పెద్ద పీట

*** శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : కాలనీలలో మౌళిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తానని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ లోని ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ, శంషిగుడా, హెచ్‌ఎంటీ శాతవాహన నగర్ కాలనీలలో రూ.3.30 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం క్రిస్టియన్ స్మశాన వాటిక , పార్క్ లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం ,అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకం లో శేరిలింగంపల్లి నియోకజకర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన ,అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదితానని అన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని, ప్రజలకు ట్రాఫిక్ రహిత ,సుఖవంతమైన ,మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, డివిజన్ పాస్టర్లు, కాలనీ వాసులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు,మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

* **నేరాలకు పాల్పడితే శిక్ష తప్పదు: ఎస్పీ మహేష్ బి గితే**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్:భర్త హత్య కేసులో భార్యతోపాటు మరో ఇద్దరు నిందుతులకు జీవిత ఖైదు పడిరది. భర్త హత్యకు కారణమైన భార్యతోపాటుగా మరో ఇద్దరు నిందుతులకు జీవిత ఖైదుతోపాటు ఒక్కొక్కరికి 2వేల రూపాయల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రధాన న్యాయమూర్తి నీరజ శుక్రవారం తీర్పు ఇచ్చారు. ముస్తాబాద్ మండలం సేవాలాల్ తండాకు చెందిన దరంసోత్ శంకర్ నాయక్ (55) అనే వ్యక్తికి ఇద్దరు భార్యలు. మొదటి భార్య దరంసోత్ సరోజకు పిల్లలు పుట్టడం లేదని రాజవ్వ అనే మరో మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు జన్మించారు. అప్పటి నుండి మొదటి భార్య అయిన దరంసోత్ సరోజ వారిపై పగ పెంచుకొని గొడవలు పడుతూ ఉండేది. వారికున్న ఆస్తి అంతా రెండవ భార్య, వారి సంతానానికి రాసిస్తాడనే అనే భయంతో తన భర్త అయిన శంకర్ నాయక్‌ను నవంబర్ 28, 2020న మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో పథకం ప్రకారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సరోజ, ఆమె తమ్ముడైన బానోతు శ్రీనివాస్, చెల్లెలు తేజావత్ లక్ష్మిలను పిలిపించుకొని భర్త శంకర్ నాయక్‌కి మందు బాగా తాగించి రోకలి బండతో కొట్టి ముగ్గురు కలిసి చంపారని, రెండో భార్య అయిన రాజవ్వ ఫిర్యాదు మేరకు అప్పటి సిరిసిల్ల రూరల్ సిఐ సర్వర్‌కు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. తరువాత సిఐ ఉపేందర్ కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ ఎస్ఐ రవీంద్ర నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ దేవేందర్, రాజేందర్, సిఎంఎస్ కానిస్టేబుల్ నవీన్‌లు కోర్టులో 15 మంది సాక్షులను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్ వాధించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితులైన దరంసోత్ సరోజ, బానోతు శ్రీనివాస్, తేజావత్ లక్ష్మిలకు జీవిత ఖైదీతోపాటు ఒక్కొక్కరికి 2000 రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకొలేరని, శిక్షలతోనే సమాజంలో మార్పు వస్తుందని, పోలీసులు, ప్రాసిక్యూషన్ వారు వ్యూహంతో న్యాయ విచారణ, న్యాయ నిరూపణ జరిపి కచ్చితంగా శిక్షలు పడేలా చేస్తారని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే తెలిపారు. ఈ కేసులో నిందితులకి శిక్ష పడటంలో కృషి చేసిన అప్పటి విచారణ అధికారులు సర్వర్, ఉపేందర్, ప్రస్తుత సిఐ మొగిలి, ఎస్ఐ గణేష్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్, కోర్టు మానిటరింగ్ ఎస్సై రవీంద్ర నాయుడు, కోర్టు కానిస్టేబుల్ దేవేందర్, రాజేందర్, సిఎంఎస్ కానిస్టేబుల్ నవీన్‌లను ఎస్పీ అభినందించారు.

## వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డి ని కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే



ప్రజాస్ఫూర్తి, కాప్రా : ఖైరతాబాద్ లోని వాటర్ వర్క్స్ కార్యాలయంలో ఎండీ అశోక్ రెడ్డి ని కలిసి చర్లపల్లి డివిజన్ పరిధిలోని మోడీ విస్టా లో ప్రధాన సమస్య వాటర్ బిల్ అధికంగా వస్తుంది అని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఎండీ అశోక్ రెడ్డి ని కలిసి వాటర్ బిల్ అధికంగా వస్తుంది అని దానికి తోడు ఇంట్రెస్ట్ కూడా వేయడంతో రూ 7,45,240 / రూపాయలు వచ్చింది అని తెలియజేయగా వెంటనే స్పందించిన ఎండీ సమస్య పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు నేమూరి మహేష్‌గౌడ్, మోడీ విస్టా మాజీ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి , వీర బ్రమ్మా చారి, కృష్ణ రావు, నర్ర వీర భద్ర రావు, భాస్కర్ , భరణీ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రపతి ముర్ము పుట్టినరోజు వేడుకలలో నాటిన మొక్క



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పుట్టినరోజును పురస్కరించుకుని కొత్తగూడెంకు చెందిన , ప్రకృతి హరిత దీక్ష, గ్రీన్ మోటర్ వెహికల్ గార్డెన్ వ్యవస్థాపకులు, సింగరేణి యన్ కె ఎన్ మొక్కల రాజశేఖర్ కొత్తగూడెం రైల్వే స్టేషన్ ప్రాంగణంలోని శ్రీ కోదండ రామాలయ ప్రాంగణంలో ఇప్ప మొక్కను నాటారు.రామవరం కు చెందిన ప్రకృతి హరిత దీక్షపరురాలు నైనిక రజువా శుక్రవారం మందార మొక్కను నాటారు. రామవరంలో మొక్కను నాటిన అనంతరం ప్రతి ఒక్కరు తమ పుట్టినరోజు నాడు ఒక మొక్కను నాటి సంరక్షించాలని నైనిక కోరారు. మొక్కలను నాటి సంరక్షించడం వల్ల భవిష్యత్తులో అవి మనకు రక్షణ కల్పిస్తాయని అన్నారు. అదేవిధంగా ఈ వర్షాకాలంలో ప్రతీ ఒక్కరు రాష్ట్ర, జాతీయ రహదారుల వెంబడి, ఖాళీ ప్రదేశాల్లో పండ్ల మొక్కలు నాటడం, విత్తనాలు చల్లడం చేయాలని నైనిక కోరారు.ఈ కార్యక్రమంలో సంధ్య, కిరణ్ మై, లహరి, ఆర్యన్ తదితరులు పాల్గొన్నారు.

## 150వ సారి శబరిమల యాత్ర పూర్తిచేసుకున్న వివిస్వి. రమణ గురుస్వామి

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఫతేనగర్, హైదరాబాద్ వివిస్వి రమణ గురుస్వామి 150వ సారి శబరిమల యాత్ర, అయ్యప్ప స్వామి వారి దర్శనం పూర్తిచేసుకున్నారు. ఇంతటి శబరిమల యాత్ర దర్శన భాగ్యం వారి శిష్యులు తెలుపుతూ వివిస్వి రమణ గురుస్వామి



1990 లో మొదటిసారి అయ్యప్ప మాలధారణ చేయ డం కన్నె స్వామిగా , ప్రతి మాసం యాత్ర చేయడంతో వారి ప్రయాణం ఈరోజుతో 150వ సారి శబరిమల వెళ్లి స్వామివారిని దర్శించుకోవడం వారి శిష్యులుగా మాకుకూడా ఎంతో సంతోషంగా ఉంది. శబరిమల మేల్ శాంతి సత్కరించారు స్వామి శరణం

# పేదల కలల సాకారం వైపు ఇందిరమ్మ ప్రభుత్వం పయనం

* **వెంగళరావు సాగర్ పునరుద్ధరణకు 33 కోట్లు..**
* **అశ్వరావుపేట నియోజకవర్గం పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి..**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పేదల కలలను సాకారం చేసే దిశగా ఇందిరమ్మ ప్రభుత్వం పయనిస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారం మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం అశ్వరావుపేట నియోజకవర్గం లోని చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మరియు ములకలపల్లి మండలాల్లో విస్తృతంగా పర్యటించి ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ మరియు పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామ సహాయం రఘురామిరెడ్డి, అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, భద్రాచలం ఐటిడిఏ పిఓ రాహుల్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా చంద్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామంలో 130 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా నునావత్ పార్వతి ,భర్త నాగేశ్వరరావు ఇందిరమ్మ,ఇంటి పనులకు మంత్రి భూమిపూజ నిర్వహించారు. అనంతరం తిప్పనపల్లి గ్రామంలో కోటి 70 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్ల పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అన్నపురెడ్డిపల్లి మండలం మర్రిగూడెం గ్రామంలో 34 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా అట్ల లక్ష్మి ,భర్త మోహన్ రావు ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ నిర్వహించారు. ములకలపల్లి మండలం మాదారం గ్రామంలో 24 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా పుష్పలత ఇందిరమ్మ ఇంటి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.. ఈ పర్యటనలో భాగంగా మొత్తం ఐదు హై లెవెల్ బ్రిడ్జి పనులు చంద్రుగొండ మండలం సీతాయి గూడెం 2 కి. మీ వద్ద 3.20 కోట్లు, అన్నపురెడ్డిపల్లి మండలం కంపగూడెం గ్రామం 1/0 కి. మీ వద్ద 3.25 కోట్లు, ములకలపల్లి మండలం చింతలపాడు 3/4 కి. మి వద్ద 2.10 కోట్లు , ములకలపల్లి మండలం పాతూరు గ్రామం 0/400 కి. మి వద్ద 1.60 కోట్ల వ్యయంతో చేపట్టనున్న హై లెవెల్ బ్రిడ్జ్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పేదవాడి సొంతింటి కల సహకారం చేసేందుకు గాను మొదటి విడతలో నాలుగున్నర లక్షల ఇళ్లను మంజూరు చేశామన్నారు. దీనిలో భాగంగా అశ్వరావుపేట నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయగా ఈ గిరిజన ప్రాంతానికి 1000 అదనపు ఇందిరమ్మ ఇండ్లను కూడా మంజూరు చేయడం జరిగిందన్నారు. తిప్పనపల్లి గ్రామంలో 130 ఇండ్లు మంజూరు అయ్యాయని అందులో 75 పైగా ఇళ్ల నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతుందని, మిగిలిన ఇండ్ల నిర్మాణం కూడా వేగవంతంగా చేపట్టాలని లబ్ధిదారులను మంత్రి కోరారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కూడా త్వరలో ప్రారంభించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు దశలవారీగా ప్రతి సోమవారం నిధులను విడుదల చేయడం జరుగుతుందన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో 17 వేల కోట్లు రుణమాఫీ చేయగా, ప్రస్తుత ప్రభుత్వం 10 నెలల్లోనే 21 వేల కోట్ల రూపాయలను రైతులకు మాఫీ చేసిందన్నారు. రైతు భరోసా పథకం కింద ఇటీవల తొమ్మిది రోజుల్లోనే తొమ్మిది వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాలో జమ చేసినట్లు మంత్రి చెప్పారు. పేదల సంక్షేమానికై ఉచిత విద్యుత్, 500 కే గ్యాస్, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలతో పేదల సంక్షేమానికి పెద్దపీట ఈ ఇందిరమ్మ ప్రభుత్వం వేస్తుందని అన్నారు. చంద్రుగొండ మండలంలోని వెంగళరావు సాగర్ ప్రాజెక్టు పునరుద్ధరణకు 33 కోట్లు మంజూరు చేసినట్లు ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు. అశ్వరావుపేట నియోజకవర్గ పర్యటనలో భాగంగా మంత్రి వెంగళరావు సాగర్ ప్రాజెక్ట్ పునర్నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ప్రాజెక్టు మరమ్మత్తులు, సర్కులర్ బీచ్ నిర్మాణం తదితర పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. 2019 వరదల్లో తీవ్రంగా దెబ్బతిన్న ఈ ప్రాజెక్టు సమస్యను గత ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఈ ప్రాంత రైతులకు వెంగళరావు సాగర్ ప్రాజెక్టు జీవనాధారం అని అన్నారు. గత ప్రభుత్వానికి ఈ గిరిజన ప్రాంతం ఇందులోని పంట పొలాలు కనిపించలేదని, పెద్ద పెద్ద ప్రాజెక్టులు వైపే చూసింది కానీ, కనీసం ఆలోచన లేకుండా వెంగళరావు ప్రాజెక్ట్ మరమ్మతులకు నిధులు ఇవ్వలేదని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మరియు స్థానిక శాసనసభ్యులు జారే ఆదినారాయణ కృషితో ఈ ప్రాజెక్టుకు జీవం పోసే ప్రయత్నం జరుగుతుందన్నారు. ఒక్క ఎకరం కూడా ఎండిపోకుండా చిట్ట చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రాజెక్టులకు గౌరవం ఇవ్వని వారి పాలనతో పోలిస్తే ప్రజల ఆశయాలకు అనుగుణంగా వారి ఆశయాలను నెరవేర్చే విధంగా ఈ ప్రభుత్వ పాలన కొనసాగుతుందని మంత్రి చెప్పారు. ఈ పర్యటనలో హౌసింగ్ పిడి శంకర్, పంచాయతీరాజ్ ఈ ఈ శ్రీనివాసరావు, ఆర్ అండ్ బి ఈ ఈ వెంకటేశ్వరరావు , జిల్లా అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

# కొత్తగూడెం ఓ బి లో పాత వారికే అవకాశం కల్పించాలి

* **జిఎం షాలెం రాజుకి వినతి పత్రం ఇచ్చిన కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం వీకేఓసి కి సౌదా కంపెనీ టెండర్ వేసి కార్మికుల నియామకాల విషయంలో ప్రైవేటు ఏజెన్సీల వ్యవహరిస్తుందని దీనిపై గత వారం రోజులుగా సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తుంది.దశల వారి కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెం జిఎం షాలెం రాజు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమానికి ఐఎన్టీయూసీ నాయకులు మోహన్, బి ఎం ఎస్ ఎం రవి, హెచ్ఎంఎస్ ఆంజనేయులు, ఐ ఎఫ్ టి యు ఎన్ సంజీవ్, టిఎన్టియుసి రవి గౌడ్, సి కె హెచ్ పి ఎస్ యాకయ్య బి డబ్ల్యు బి ఎస్ హైట్ శివ వివరిస్తూ ఎన్నో ఏళ్లుగా 600 మంది కార్మికులు ఓసి లో పనిచేస్తున్నారు ఇప్పుడు కొత్తగా వచ్చిన సౌదా కంపెనీ కార్మికుల జీవితాలతో చెలగాటే విధంగా నూతన పద్ధతులు తీసుకొస్తుంది ప్రైవేటు ఏజెన్సీలను మరిపించే విధంగా బయోడేటాలు స్వీకరిస్తున్న వల్ల భూములు కోల్పోయి పొట్ట చేత పట్టుకొని పని లేక అల మటిస్తున్న కార్మికులు ఈ నూతన పద్ధతులను వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్నారు. 2018 తర్వాత ఓసి మూతపడడంతో అనేక మంది కార్మికులు నిరాశ్రయులుగా మిగిలిపోయారు. అదే సమయంలో మహమ్మారి కరోనాతో అప్పులపాలై ఇబ్బందులకు గురయ్యారు. విపరీతమైన ధరలు పెరగడంతో కుటుంబ పోషణ కూడా భారంగా మారిపోయింది. భూములు ఇండ్లు పని కోల్పోయి స్థానికంగా ఏ పని లేకపోవడం వలన వరుసపై బతకవలసి వస్తుంది అదే క్రమంలో సౌదా కంపెనీ వచ్చిందని తెలిసి ఆనందించే లోపే నూతన ఉద్యోగాల ప్రక్రియ పేరుతో చేస్తున్న ఇది కొంత ఆందోళన కలిగించింది దీనితో కార్మికులు ఆందోళనకు గురై వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది తెలిపారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు జేఏసీగా ఏర్పడి కార్మికులకు అండగా నిలిచాయి దశల వారి కార్యక్రమాలు ఆందోళనలో భాగంగా శుక్రవారం జీఎంను కలిసి సమస్యను వివరించడం జరిగింది. అనంతరం జిఎం సాలెం రాజు మాట్లాడుతూ గతంలో పనిచేసిన వారికి అవకాశం ఇస్తామని ఏ ఒక్క కార్మికుడికి అన్యాయం జరగదని అలా జరిగితే మాదే బాధ్యత అని హామీ ఇవ్వడంతో కార్మికులు సంఘ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జేఏసీ కార్మిక సంఘాల నాయకులు వాసు,శరత్,రామ్ చందర్,రవికుమార్, విజయ్,రాజు,శ్రీను,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# జూలై 9 దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మె ను జయప్రదం చేయండి

* **సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె.చంద్రశేఖర్**

ప్రజాస్ఫూర్తి, కాప్రా : కార్మికుల ఉద్యోగ భద్రతను తొలగిస్తూ, పెట్టుబడిదారుల ప్రయోజనాలకే మక్కువ చూపుతున్న కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు.శుక్రవారం తెలంగాణ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్లు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటి ఆధ్వర్యంలో కమలానగర్ లోని సీ ఐ టీ యూ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ ల వల్లన కార్మికుల ఉద్యోగ భద్రత, హక్కులు తీవ్రంగా దెబ్బతింటున్నాయని అన్నారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లు తీసుకురావడాన్ని తక్షణం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కోడ్ లను వ్యతిరేకిస్తూ జూలై 9న జరగనున్న దేశవ్యాప్తంగా కార్మిక సమ్మెకు సీఐటీయూ మద్దతు ప్రకటించింది.కనీస వేతనం నెలకు రూ.26,000గా నిర్ణయించాలి, ఔట్‌సోర్స్, ఫిక్స్డ్ టర్మ్, ట్రైనీలు, అప్రెంటిస్‌లను క్యాజువలైజ్ చేయకూడదని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలి, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్‌పై సెంట్రల్ ఎక్సైజ్ తగ్గించాలి. జీఎస్టీను ఆహారం, మందులు, వ్యవసాయ ఉత్పత్తులపై తొలగించాలని డిమాండ్ చేశారు.

**ఆహార భద్రత చట్టానికి హామీ ఇవ్వాలి.**

ఉద్యోగ భద్రతపై ప్రభావం పడుతుందన్నారు. పది గంటలకు పెంచే ప్రయత్నం జరుగుతున్నదని కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై 9న దేశ వ్యాపిత సమ్మె చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు, స్థానిక కార్మిక సంఘాలు ఉద్యోగ ఫెడరేషన్ లు పిలుపునిచ్చాయని తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థను సార్వత్రిక చేయాలి లాంటి మొత్తం ఇరవై డిమాండ్లను నెరవేర్చి



వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శంకర్ రావు, మేడ్చల్ జిల్లా సిఐటియు అధ్యక్షుడు ఎర్ర అశోక్, టీయూసీఐ ప్రవీణ్, ఐఎఫ్‌టీయూ లక్ష్మయ్య, టిఆర్ఎస్ కె వి ప్రభాకర్, సిఐటియు జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణ, ఆశా వర్కర్స్ నేత రేవతి కళ్యాణి, మున్సిపల్ నాయకులు ఎన్.శ్రీనివాస్, సిఐటియు నాయకులు రాజశేఖర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో అధిక నిధులు బీజేపీ కేంద్ర ప్రభుత్వానివే

*** మలోత్ వినోద్ నాయక్**

యాదగిరిగుట్ట ప్రజాస్ఫూర్తి : బొమ్మలరమరం మండలం బుక్కతాండలో బిజెపి కేంద్ర ప్రభుత్వం11 సంవత్సరలు పూర్తి చేసుకున్న సందర్భంగా వికాస్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు, బీజేపీ మండల అధ్యక్షులు మలోత్ వినోద్ నాయక్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమనికి ముఖ్య అదితి గా కొక్కొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతు నేడు గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాజ్ యోజన స్కిం కింద రెండు లక్షల డెబై ఐదువేల రూపాయలను ప్రతి ఇంటికి ఇస్తుందని అన్నారు, అలాగే తెలంగాణ రాష్ట్రనికి ఒక లక్ష ఇండ్లను మంజూరు చేసిందని ఇంకా సరిపోని యెడల ఇంకా అదనపు ఇండ్లను మంజూరు చేయడానికి సిధంగా ఉందని అన్నారు, ఎలాంటి షరతు లేకుండా ప్రతి నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని కోరారు భారత ప్రధాని నరేంద్రమోదీ పదకొండు సంవత్సరాల క్రితం అధికారంలోకి వచ్చేనాటికి దేశ ఆర్థిక పరిస్థితి 10వ స్థానంలో ఉందని మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈరోజు ప్రపంచంలో 4వ ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది అన్నారు, 70 సంవత్సరాలు అధిరం అనుభవించిన కాంగ్రెస్ పార్టీ అనేక



కుంభకోణాలు చేసి దేశాన్ని సర్వనాశనం చేసిందని విమర్శించారు. తెలంగాణలో అనేక అమిలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత రేవంత్ రెడ్డి హామీలను తుంగలోతొక్కి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంస్కరణలు తెచ్చి దేశాన్ని అభివృద్ధి పధంలో తీసుకెళ్తున్నారని అన్నారు రేపు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పార్టీని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ బుక్య మౌనిక నాయక్,ప్రధాన కార్యదర్శి బాలరాజు, కోశాధికారి గులారి నర్సింహగౌడ్, సీనియర్ నాయకులు గుండ్ల గోపాల్,రామా గౌడ్, ఆనంద్ గౌడ్,రవిశంకర్ , ప్రవీణ్ రెడ్డి ,సాయి కుమార్ ,బుక్యా నరేష్, మల్లేష్ మరియు కార్యకర్తలు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు

## ఐదో రోజు..7 ఎకరాల వరకు రైతులకు రైతు భరోసా నిధులు జమ



హైదరాబాద్: రాష్ట్రంలో రైతు భరోసా పథకం కింద రైతుల బ్యాంకు ఖాతాల్లో పెట్టుబడి సాయం నిధుల జమ కొనసాగుతోంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాల్లో వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులకు పెట్టుబడి సాయం అందుతోంది. ఐదో రోజు(శుక్రవారం) 7 ఎకరాల వరకు రైతు భరోసా నిధులు జమ అయ్యాయి. అందుకోసం ప్రభుత్వం మరో రూ.905.89 కోట్లు విడుదల చేసినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కేవలం ఐదు రోజుల్లో రూ.7,310.59 కోట్లు విడుదల చేశామని వెల్లడించారు. ఇప్పటి వరకు 65.12లక్షల మంది రైతులకు రైతు భరోసా సాయం అందిందన్నారు. విస్తీర్ణంతో సంబంధం లేకుండా సాగుభూమికి సాయం అందజేస్తామని స్పష్టం చేశారు.

## ఏపీలో మహిళలకు ఉచిత ప్రయాణం.. కొత్త బస్సుల కొనుగోలుకు చర్యలు వేగవంతం



అమరావతి: ఆగస్టు 15 నుంచి రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం.. ఆ లోపే సరికొత్త బస్సులను రోడ్డెక్కించేందుకు చర్యలు తీసుకుంటోంది. 'PM eబస్ సేవా' పథకం కింద కేంద్రం సమకూర్చే ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం 750 ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించగా.. బస్సుల కొనుగోలు కోసం తగిన ప్రతిపాదనలను ముందుగా కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు సమర్పించాల్సి ఉంది. ప్రతిపాదనల తయారీ కోసం రాష్ట్ర స్థాయి స్టీరింగ్ కమిటీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అధ్యక్షతన స్టీరింగ్ కమిటీని ప్రభుత్వం నియమించింది. కమిటిలో మరో ఆరుగురు సభ్యులను కూడా నియమించింది. కమిటీ సభ్యుడు, కన్వీనర్‌గా ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు వ్యవహరిస్తారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సహా రవాణా, ఆర్థిక, పరిశ్రమల శాఖల ముఖ్య కార్యదర్శులను కమిటీలో సభ్యులుగా నియమించింది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 11 నగరాల్లో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. వీటి కొనుగోలు కోసం ప్రతిపాదనలు తయారు చేసి కేంద్ర ప్రభుత్వానికి అందజేయాలని నిర్దేశించింది. వీలైనంత త్వరగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సీఎస్ కె.విజయానంద్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# ఏ ఒక కార్మికుడికి అన్యాయం జరగదు

*** కార్మికులకు మాట ఇచ్చిన జిఎం**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం వీకేఓసి కి సౌదా కంపెనీ టెండర్ వేసి కార్మికుల నియామకాల విషయంలో ప్రైవేటు ఏజెన్సీల వ్యవహరిస్తుందని దీనిపై గత వారం రోజులుగా సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తుంది.దశల వారి కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెం జిఎం షాలెం రాజు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమానికి ఐఎన్టీయూసీ నాయకులు మోహన్, బి ఎం ఎస్ ఎం రవి, హెచ్ఎంఎస్ ఆంజనేయులు, ఐ ఎఫ్ టి యు ఎన్ సంజీవ్, టిఎన్టియుసి రవి గౌడ్, సి కె హెచ్ పి ఎస్ యాకయ్య బి డబ్ల్యు బి ఎస్ హైట్ శివ వివరిస్తూ ఎన్నో ఏళ్లుగా 600 మంది కార్మికులు ఓసి లో పనిచేస్తున్నారు ఇప్పుడు కొత్తగా వచ్చిన సౌదా కంపెనీ కార్మికుల జీవితాలతో చెలగాటే విధంగా నూతన పద్ధతులు తీసుకొస్తుంది ప్రైవేటు ఏజెన్సీలను మరిపించే విధంగా బయోడేటాలు స్వీకరిస్తున్న వల్ల భూములు కోల్పోయి పొట్ట చేత పట్టుకొని పని లేక అల మటిస్తున్న కార్మికులు ఈ నూతన పద్ధతులను వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్నారు. 2018 తర్వాత ఓసి మూతపడడంతో అనేక మంది కార్మికులు నిరాశ్రయులుగా మిగిలిపోయారు. అదే సమయంలో మహమ్మారి కరోనాతో అప్పులపాలై ఇబ్బందులకు గురయ్యారు. విపరీతమైన ధరలు పెరగడంతో కుటుంబ పోషణ కూడా భారంగా మారిపోయింది. భూములు ఇండ్లు పని కోల్పోయి స్థానికంగా ఏ పని లేకపోవడం వలన వరుసపై బతకవలసి వస్తుంది అదే క్రమంలో సౌదా కంపెనీ వచ్చిందని తెలిసి ఆనందించే లోపే నూతన ఉద్యోగాల ప్రక్రియ పేరుతో చేస్తున్న ఇది కొంత ఆందోళన కలిగించింది దీనితో కార్మికులు ఆందోళనకు గురై వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది తెలిపారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు జేఏసీగా ఏర్పడి కార్మికులకు అండగా నిలిచాయి దశల వారి కార్యక్రమాలు ఆందోళనలో భాగంగా శుక్రవారం జీఎంను కలిసి సమస్యను వివరించడం జరిగింది. అనంతరం జిఎం సాలెం రాజు మాట్లాడుతూ గతంలో పనిచేసిన వారికి అవకాశం ఇస్తామని ఏ ఒక్క కార్మికుడికి అన్యాయం జరగదని అలా జరిగితే మాదే బాధ్యత అని హామీ ఇవ్వడంతో కార్మికులు సంఘ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జేఏసీ కార్మిక సంఘాల నాయకులు వాసు, శరత్,రామ్ చందర్, రవికుమార్, విజయ్, రాజు, శ్రీను, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# కాలనీలో డ్రైనేజ్ సమస్యను అతిత్వరలో పరిష్కరిస్తా

*** ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**

శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : కాలనీలో ప్రధానంగా ఉన్న డ్రైనేజ్ సమస్యను అతిత్వరలో పరిష్కరిస్తామని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ఎన్టీఆర్ నగర్ , గాంధీ నగర్ కాలనీలలో డ్రైనేజీ, రోడ్లు , పారిశుద్యనికి సంబంధించిన సమస్యలు ఉన్నాయని కాలనీ వాసులు డివిజన్ కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా కార్పొరేటర్ జి.ఎచ్.ఎం.సి అధికారులతో కలిసి కాలనీలలో పాదయాత్ర చేసి సమస్యలను పరిశీలించారు. గాంధీ నగర్ కాలనీ వద్ద డ్రైనేజీ పుడుకుపోయి నిండిపోవడంతో జి.ఎచ్.ఎం.సి ఎయిర్ టెక్ యంత్రం సహాయంతో పూడికను క్లియర్ చేయించడం జరిగిందన్నారు. కాలనీ లోని డ్రైనేజ్ లైన్స్ కు సంబంధించి అవసమైన బడ్జెట్ ను ఎస్టిమేషన్ వేసి ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొన్ని చోట్ల పెండింగ్



ఉన్న సీసీ రోడ్లను కూడా నిర్మిస్తామని తెలియచేసారు. కాలనీలో పారిశుధ్య సమస్య ఎక్కువగా ఉందని, చెత్తను రోడ్ల మీద లేదా బిల్డింగ్ ల మధ్యలో వేయడం వల్ల మీరు మీ పిల్లలు రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. మీ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని, తడిచెత్తా , పొడిచెత్తను వేరువేరుగా బస్తీకి వచ్చి చెత్త సేకరించే ఆటోలలో మాత్రమే వేయాలన్నారు. చెత్తను నాలాలలో గాని, రోడ్లమీద గాని, చెరువులలో గాని వేయవొద్దని ప్రజలను కోరారు. జి.ఎచ్.ఎం.సి సిబ్బంది , కాలనీ అసోసియేషన్ సభ్యులు కలిసికట్టుగా పనిచేసి చెత్తను రోడ్లమీద వేయకుండా ప్రజలలో అవగాహన తీసుకురావాలని అన్నారు. మీ ఇంటికి వచ్చి సేవలందించే పారిశుధ్య, ఎంటమాలజి , వైద్య శాఖలకు సంబంధించిన సిబ్బందికి ప్రజలందరూ సహకరించి వారి సూచనలు పాటిస్తూ రోగాలకు దూరంగా ఉండాలని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, సిహెచ్. భాస్కర్, పోశెట్టిగౌడ్, మల్లేష్, ప్రభాకర్, మల్లేష్, సదానంద్ గౌడ్, నరసింహులు, వాలి నాగేశ్వరరావు, భిక్షపతి, ఖలీమ్, సంతోష్ బిరాదర్, రవీందర్, శ్రీను, కుమార్, సత్తిబాబు, మధులత, యస్మిన్, ఎస్.ఆర్.పి నాగేశ్వర్ నాయక్, సూపర్వైజర్ శివ, కాలనీ వాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అసాంఘిక శక్తులకు మద్దతుగా మాట్లాడడం కూడా నేరమే

# అది మర్చిపోవద్దు: పవన్

రాష్ట్రంలో అప్రజాస్వామికంగా వ్యవహరించే వారిని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిని ఉపేక్షించబోమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. అటువంటి వారిని ప్రజలు నిశితంగా గమనించాలని, అసాంఘిక శక్తుల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని ఆయన హెచ్చరించారు. వైసీపీ అధినేత జగన్ సినిమా డైలాగులతో చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో పవన్ కల్యాణ్ గురువారం మీడియా ద్వారా స్పందించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలను కట్టడి చేయకపోగా, వాటిని సమర్థించేలా మాట్లాడే వారి నేరపూరిత ఆలోచనలను ప్రజలు గమనించాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. అసాంఘిక శక్తులకు మద్దతుగా మాట్లాడటం కూడా నేరమేనన్న విషయాన్ని ఎవరూ మరచిపోరాదని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అందరూ సంయమనం పాటించాలని, రెచ్చగొట్టే వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. సినిమాల్లో చెప్పే డైలాగులు సినిమా హాళ్ల వరకే బాగుంటాయని, వాటిని నిజ జీవితంలో అమలుచేస్తామంటే



ప్రజాస్వామ్యంలో కుదరదని ఆయన హితవు పలికారు. చట్టం, నియమ నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాల్సిందేనని నొక్కిచెప్పారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు మరింత జాగ్రత్తగా మాట్లాడాలని సూచించారు. ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించేలా ప్రవర్తించే అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపాలని పోలీసులకు ప్రభుత్వం ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని కూటమి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని, అవసరమైతే రౌడీషీట్లు తెరిచి అలాంటి వారిని అదుపులోకి తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## తిప్పర్తి ఎస్సైగా వి.శంకర్ బాధ్యతల స్వీకరణ..



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : తిప్పర్తి మండల నూతన ఎస్ హెచ్ ఓ(ఎస్సై) గా శుక్రవారం తిప్పర్తి పోలీస్ స్టేషన్ లో వి.శంకర్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్సైగా పనిచేసిన సాయి ప్రశాంత్ హోలియా కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఎస్సైగా శంకర్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై శంకర్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు శాంతి భద్రతల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా గంజాయి, డ్రగ్స్ ను అరికట్టడంతో పాటు గవర్నమెంట్ పథకం ద్వారా అందించే పిడిఎస్ రైస్ పక్కదారి పడితే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తిప్పర్తి మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజా ప్రతినిధులు ప్రజలు సహకరించి మండలాన్ని శాంతిభద్రతల పరిరక్షణలో జిల్లాలో ప్రథమ స్థానంలో ఉంచేందుకు సహకరించాలని సూచించారు. మండల పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు అక్రమ చర్యలకు పాల్పడే వారుంటే పోలీస్ శాఖకు సమాచారం అందించాలని సూచించారు. మండల ప్రజలు నేరుగా తనను కలిసి వారి సమస్యలను తెలియజేయవచ్చని అన్నారు.




## వారికి 5 రోజుల పనిదినాలు.. మరో ఏడాది పొడిగించిన ఏపీ ప్రభుత్వం

అమరావతి: ఏపీ రాజధాని ప్రాంతంలో రాష్ట్రస్థాయి కార్యాలయాల్లో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు వారంలో 5 రోజుల పనిదినాలను ప్రభుత్వం మరో ఏడాది పొడిగించింది. రాష్ట్ర సచివాలయ ఉద్యోగులు సహా విభాగాధిపతులు, కార్పొరేషన్లు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు ప్రస్తుతం వారంలో 5 రోజుల పనిదినాలు అమల్లో ఉన్నాయి. ఈ నెల 26తో గడువు ముగియనుండగా.. ఆ ఉత్తర్వులను పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 27 నుంచి ఏడాది పాటు ఉత్తర్వులు అమల్లో ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని అన్ని విభాగాలకు సీఎస్ కె.విజయానంద్ ఆదేశాలు జారీ చేశారు.

## 60 యుద్ధ విమానాలతో ఇరాన్ లో నిప్పుల వర్షం కురిపించిన ఇజ్రాయెల్.. వందలమంది మృతి

ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరాయి. ఇరాన్‌లోని కీలక సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ శుక్రవారం రాత్రి భీకర వైమానిక దాడులకు పాల్పడింది. 60 యుద్ధ విమానాలతో ఇరాన్ లోని లక్ష్యాలపై నిప్పులు చెరిగింది. ముఖ్యంగా, ఇరాన్ అణు కార్యక్రమంతో సంబంధం ఉందని ఆరోపణలు ఎదుర్కొంటున్న డిఫెన్సివ్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ సంస్థ (ఎస్పీఎన్‌డీ) ప్రధాన కార్యాలయంపై బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో దాదాపు 639 మంది మరణించినట్లు ప్రాథమిక సమాచారం.ఇరు దేశాల మధ్య ఈ ఘర్షణ వాతావరణం రెండో వారంలోకి ప్రవేశించింది. ఇరాన్ అణ్వాయుధాలను సమకూర్చుకోకుండా నిరోధించడమే తమ లక్ష్యమని ఇజ్రాయెల్ మొదటి నుంచి వాదిస్తోంది. అయితే, తమ అణు కార్యక్రమం కేవలం శాంతియుత ప్రయోజనాల కోసమేనని ఇరాన్ పునరుద్ఘాటిస్తోంది. ఇజ్రాయెల్ దాడులకు ప్రతిగా ఇరాన్ కూడా క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసింది. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో, యూరోపియన్ దేశాలు దౌత్య మార్గాల ద్వారా ఇరాన్‌ను శాంతియుత చర్చలకు తీసుకురావడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ విషయంలో తమ దేశం జోక్యంపై రెండు వారాల్లోగా నిర్ణయం తీసుకుంటామని సంకేతాలిచ్చారు. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) వెల్లడించిన వివరాల ప్రకారం, 60కి పైగా యుద్ధ విమానాలు, సుమారు 120 శక్తివంతమైన ఆయుధాలతో ఈ దాడులు జరిగాయి. టెహ్రాన్ పరిసర ప్రాంతాల్లోని పలు క్షిపణి తయారీ కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నారు. వీటిని ఇరాన్ రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన కీలక పారిశ్రామిక ప్రాంతాలుగా ఐడీఎఫ్ అభివర్ణించింది. క్షిపణి విడిభాగాలు, రాకెట్ ఇంజన్ల తయారీకి ఉపయోగించే ముడి పదార్థాల ఉత్పత్తి కేంద్రాలపై దాడులు కేంద్రీకరించినట్లు తెలుస్తోంది. టెహ్రాన్‌లోని ఎస్పీఎన్‌డీ ప్రధాన కార్యాలయ భవనాన్ని ఈ ఆపరేషన్‌లో విజయవంతంగా ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. "క్షిపణి విడిభాగాల ఉత్పత్తికి సంబంధించిన సైనిక పారిశ్రామిక ప్రాంతాలు, రాకెట్ ఇంజన్ల తయారీకి వాడే ముడిపదార్థాల ఉత్పత్తి కేంద్రాలపై దాడి చేశాం.

# గోపన్‌పల్లి భూ వివాదం కేసు : సీఎం రేవంత్ పిటిషన్‌పై తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు

* **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై 2016లో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసు**
* **కేసు కొట్టివేయాలని ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ పూర్తి**
* **ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం**
* **తీర్పును రిజర్వు చేస్తూ హైకోర్టు నిర్ణయం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంబంధించిన ఒక కీలక కేసులో తెలంగాణ హైకోర్టులో వాదనలు ముగిశాయి. 2016లో గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఆయనపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును కొట్టివేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి 2020లో దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయస్థానం సుదీర్ఘంగా విచారణ జరిపింది. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం ధర్మాసనం తీర్పును రిజర్వులో ఉంచింది. రంగారెడ్డి జిల్లా గోపన్‌పల్లిలోని సర్వే నంబర్ 127లో ఉన్న 31 ఎకరాల భూమి హక్కుల విషయమై ఎస్సీ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి, రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డితో పాటు



లక్ష్మయ్యలకు మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో, 2016లో సొసైటీకి చెందిన స్థలంలోకి కొందరు అక్రమంగా ప్రవేశించారని, అప్పట్లో ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డి ప్రోద్బలంతోనే ఇది జరిగిందని సొసైటీ ప్రతినిధి ఎన్. పెద్దిరాజు ఆరోపించారు. తనను అడ్డుకున్నప్పుడు కులం పేరుతో దూషించారని ఆయన గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు రేవంత్ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసును రద్దు చేయాలని అభ్యర్థిస్తూ రేవంత్ రెడ్డి 2020లో హైకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా రేవంత్ రెడ్డి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, ఘటనా స్థలంలో రేవంత్ రెడ్డి లేరని, రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే అప్పటి ప్రభుత్వం ఈ కేసు బనాయించిందని కోర్టుకు తెలిపారు. మరోవైపు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ, ఫిర్యాదుదారుడైన పెద్దిరాజు 2014లోనే చందానగర్‌లో రేవంత్ రెడ్డిపై ఇలాంటిదే ఒక ఫిర్యాదు చేశారని, అయితే సరైన ఆధారాలు లేకపోవడంతో ఆ కేసును కోర్టు కొట్టివేసిందని గుర్తుచేశారు. అనంతరం 2016లో గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో పెద్దిరాజు మళ్లీ ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఈ కేసులో విచారించిన 8 మంది సాక్షుల వాంగ్మూలాల ప్రకారం కూడా రేవంత్ రెడ్డి సంఘటనా స్థలంలో లేరని వారు చెప్పిన విషయాన్ని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరువర్గాల వాదనలు పూర్తి కావడంతో, హైకోర్టు ఈ పిటిషన్‌పై తన తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది.

## హన్మకొండ కోర్టుకు బాంబు బెదిరింపు

* **హన్మకొండ, వరంగల్ జిల్లా కోర్టులకు బాంబు బెదిరింపు**
* **డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చిన దుండగుడు**
* **బాంబు స్క్వాడ్‌తో పోలీసుల తనిఖీలు**




హన్మకొండ, వరంగల్ జిల్లా న్యాయస్థానాలకు శుక్రవారం బాంబు బెదిరింపు రావడంతో తీవ్ర కలకలం రేగింది. గుర్తుతెలియని వ్యక్తి ఒకరు నేరుగా డయల్ 100కు ఫోన్ చేసి కోర్టు ప్రాంగణాల్లో బాంబులు అమర్చినట్లు చెప్పడంతో అధికారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వెంటనే కోర్టు సిబ్బంది ఈ విషయాన్ని స్థానిక పోలీసులకు తెలియజేశారు. వెంటనే పోలీసులు అప్రమత్తమయ్యారు. బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో కలిసి జిల్లా కోర్టుల ప్రాంగణాలకు చేరుకుని విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ ఘటనతో కోర్టు కార్యకలాపాలకు కొంతసేపు అంతరాయం కలిగింది. న్యాయవాదులు, కోర్టు పనుల నిమిత్తం వచ్చిన వారు, కోర్టు సిబ్బంది భయాందోళనలకు గురయ్యారు. ఇటీవలి కాలంలో ఇలాంటి బాంబు బెదిరింపు కాల్ రావడం ఇది మూడోసారి కావడం గమనార్హం.

## కేటీఆర్, జగదీశ్‌రెడ్డి పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు...

### కోర్టును సమయం కోరిన తీన్మార్ మల్లన్న!

* **కేటీఆర్, జగదీశ్‌రెడ్డిలపై మేడిపల్లి పీఎస్ కేసు**
* **కొట్టివేయాలని హైకోర్టులో వారిద్దరి పిటిషన్**
* **ఫేక్ వీడియో ఆరోపణలపై తీన్మార్ మల్లన్న ఫిర్యాదు**
* **తప్పుడు సెక్షన్లని కేటీఆర్ తరఫు లాయర్ వాదన**
* **విచారణ ఈ నెల 27కు వాయిదా వేసిన హైకోర్టు**



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డిలపై మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ వారు దాఖలు చేసిన పిటిషన్లపై శుక్రవారం తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో ఒక నకిలీ వీడియోను సృష్టించి, ప్రచారం చేశారంటూ తీన్మార్ మల్లన్న ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా మేడిపల్లి పోలీసులు కేటీఆర్, జగదీశ్ రెడ్డిలపై కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి హైకోర్టులో జరిగిన విచారణలో కేటీఆర్, జగదీశ్ రెడ్డిల తరఫున న్యాయవాది రమణారావు తమ వాదనలు వినిపించారు. పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు సరికాదని, అవి తప్పుగా నమోదు చేయబడ్డాయని ఆయన కోర్టు దృష్టికి తెచ్చారు. పోలీసులు పేర్కొన్న సెక్షన్లకు మద్దతుగా ఎలాంటి ఆధారాలు లేవని ఆయన వాదించారు. అనంతరం, ఈ కేసులో ఫిర్యాదుదారుగా ఉన్న తీన్మార్ మల్లన్న తరఫు న్యాయవాది తమ వాదనలు వినిపించేందుకు కొంత సమయం కావాలని కోర్టును అభ్యర్థించారు. ఇందుకు అంగీకరించిన ఉన్నత న్యాయస్థానం, తదుపరి విచారణను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేసింది.

## కొండా మురళి వ్యాఖ్యలపై స్పందించిన టీపీసీసీ చీఫ్

* **కొండా మురళి వ్యాఖ్యలపై నివేదిక కోరానన్న టీపీసీసీ చీఫ్**
* **డీసీసీ, పరిశీలకుడి నివేదిక వచ్చాక స్పందిస్తానని వెల్లడి**
* **కొండా మురళి వ్యాఖ్యలపై ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు అందాయని వెల్లడి**



వరంగల్ జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు కొండా మురళి చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. కొండా మురళి వ్యాఖ్యలపై నివేదిక కోరినట్లు ఆయన తెలిపారు. డీసీసీ, పరిశీలకుడి నివేదిక అందిన తర్వాత స్పందిస్తానని పేర్కొన్నారు. కొండా మురళి వ్యాఖ్యలపై ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు అందినట్లు ఆయన వెల్లడించారు. ఆ ఫిర్యాదులను పరిశీలిస్తామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కూడా టీపీసీసీ చీఫ్ స్పందించారు. కోర్టు పరిధిలో ఉన్న అంశాలపై మాట్లాడటం సరికాదని సూచించానని అన్నారు. కార్యకర్తల ఉత్సాహం కోసమే అలా మాట్లాడినట్లు వివరణ ఇచ్చారని తెలిపారు. కోర్టు తీర్పు వెలువడిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని ఆయన అన్నారు.

## ఆ ఐదు పంచాయతీలు తెలంగాణకు అప్పగించాలి

* **పోలవరం ప్రాజెక్టు నిర్వహణను ఉమ్మడి ఏపీలోనే వ్యతిరేకించామన్న కవిత**
* **తెలంగాణకు చెందిన 7 మండలాలను ఏపీకి అన్యాయంగా అప్పగించారని ఆరోపణ**
* **పోలవరం సామర్థ్యం పెంచడంతో ముంపు పెరుగుతోందని ఆందోళన**
* **ఐదు గ్రామపంచాయతీలను తెలంగాణకు వెనక్కి ఇవ్వాలని డిమాండ్**
* **జూన్ 25న ప్రధాని సమావేశంలో ఈ విషయం ప్రకటించాలని విజ్ఞప్తి**




పోలవరం ప్రాజెక్టు కారణంగా ముంపునకు గురవుతున్న ఐదు గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణకు అప్పగించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ నెల 25న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో నిర్వహించ తలపెట్టిన 'ప్రగతి ఎజెండా' సమావేశంలో ఈ మేరకు ప్రకటన చేయాలని ఆమె కోరారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో కవిత ఈ వ్యాఖ్యలు చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్వహణ అంశాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడే తాము వ్యతిరేకించామని కవిత గుర్తుచేశారు. అప్పట్లో సుప్రీంకోర్టును ఆశ్రయించి ప్రాజెక్టును ఆపేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని తెలిపారు. రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించిందని ఆమె అన్నారు. "2014లో మోదీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన తొలి మంత్రివర్గ సమావేశంలోనే ఆర్డినెన్స్ తీసుకొచ్చి తెలంగాణకు చెందిన ఏడు మండలాలను అన్యాయంగా ఆంధ్రప్రదేశ్‌కు అప్పగించారు. దీంతోపాటు 460 మెగావాట్ల సామర్థ్యం ఉన్న లోయర్ సీలేరు పవర్ ప్రాజెక్టును కూడా ఏపీకే ఇచ్చేశారు" అని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పార్లమెంటులో పోరాటం చేశామని, నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ బంద్‌కు పిలుపునిచ్చినా కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదని ఆమె విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యాన్ని 36 లక్షల క్యూసెక్కుల నుంచి 50 లక్షల క్యూసెక్కులకు పెంచుకుంటూ పోవడం వల్ల ముంపు సమస్య తీవ్రమవుతోందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో మానవీయ కోణంలో ఆలోచించి, తక్షణమే పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని ఆమె నొక్కిచెప్పారు. ముఖ్యంగా పురుషోత్తమపట్నం, గుండాల, ఎటపాక, కన్నాయిగూడెం, పిచుకులపాడు గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణకు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. "రాబోయే జూన్ 25వ తేదీన ప్రధాని మోదీ నాలుగు రాష్ట్రాల సీఎంలతో 'ప్రగతి ఎజెండా' పేరిట సమావేశం నిర్వహిస్తున్నారు. ఆ సమావేశంలో ఈ ఐదు పంచాయతీలను తెలంగాణకు తిరిగి ఇస్తున్నట్లు ప్రకటించాలి" అని కవిత స్పష్టం చేశారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు.. ఐదో విడత

### ప్రభాకర్‌రావును సుదీర్ఘంగా ప్రశ్నించిన సిట్



హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును శుక్రవారం సిట్ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. జూబ్లీహిల్స్ పీఎస్‌లోని సిట్ కార్యాలయంలో 8 గంటలకు పైగా ప్రశ్నించారు. ఇప్పటికే ఈనెల 9, 11, 14, 19 తేదీల్లో విచారించిన సిట్ అధికారులు .. ఇవాళ నిందితులు.. సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా ప్రశ్నించినట్టు సమాచారం. విచారణలో ప్రభాకర్‌రావు సిట్‌కు పూర్తిగా సహకరించలేదని సమాచారం. కీలకమైన ప్రశ్నలకు సమాధానాలు దాటవేసినట్టు తెలుస్తోంది. దర్యాప్తునకు ప్రభాకర్‌రావు సహకరించడం లేదని సిట్ అధికారులు కోర్టుకు తెలిపే అవకాశముంది.

## ట్యాపింగ్‌పై సాక్ష్యం ఇస్తా.. చర్యలు తీసుకోకపోతే సీఎందే బాధ్యత

: **ప్రేమేందర్‌రెడ్డి**

హైదరాబాద్: రాష్ట్రంలో ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సిదని.. ఇప్పుడు కుంటి సాకులు చెబుతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి విమర్శించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ చెప్పిందని, ఇప్పుడు అది చేయలేక కోర్టు, కేంద్రంపై నెట్టేసి విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా భాజపా సంసిద్ధంగా ఉందన్నారు. "కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, ఈ కార్ రేసుపై ఎన్నికల ముందు విమర్శలు చేసిన కాంగ్రెస్.. ఇప్పుడు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? భాజపా నాయకులు, స్టేట్ ప్రెసిడెంట్‌తోపాటు నా ఫోన్ కూడా ట్యాపింగ్ అయిందని జూబ్లీహిల్స్ పోలీసులు చెప్పారు. సోమవారం వెళ్లి సాక్ష్యం, ఇతర వివరాలు వారికి అందిస్తాను. మేము సాక్ష్యం అందించాక కూడా దీనిపై చర్యలు తీసుకోకపోతే సీఎం రేవంత్‌రెడ్డిదే బాధ్యత" అని అన్నారు.

## కడియం శ్రీహరి..

### నాముందు కూర్చోవడానికి నామోషీగా ఫీలవుతున్నారు

: **మంత్రి కొండా సురేఖ**



వరంగల్: నా మంత్రి పదవి పోతుందంటూ కడియం శ్రీహరి తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని మంత్రి కొండా సురేఖ మండిపడ్డారు. తన ముందు కూర్చోవడానికి కడియం నామోషీగా ఫీలవుతున్నారని అన్నారు. మీడియాతో ఆమె ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ.. పలు అంశాలపై స్పందించారు. కడియం శ్రీహరిపై విమర్శలు గుప్పించారు. "సీఎం, మంత్రి పొంగులేటి వద్ద కడియం నాపై అసత్య ప్రచారం చేస్తున్నారు. తెదేపాలో నడిపించుకున్నట్లు.. ఇక్కడ కూడా నడిపించాలని అనుకుంటున్నారు. కడియం కుమార్తెకు అదృష్టం ఉండి ఎంపీ అయ్యారు. నా కుమార్తెకు అదృష్టం లేక ఎమ్మెల్యే కాలేదు. కడియం కుమార్తె ఎంపీ పదవి తీయాలని నేను అంటున్నానా? భద్రకాళీ ఆలయాన్ని కొందరు తమ సొత్తుగా భావిస్తున్నారు.. కానీ, ఎవరి సొత్తు కాదు. ఈనెల 22న జరగాల్సిన భద్రకాళీ అమ్మవారి బోనాలను తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయించాం. కొందరి అభ్యంతరాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నాం. అసాంఘిక శక్తులతో గొడవలు సృష్టిస్తారనే అనుమానం ఉంది. మాంసాహారంతో బోనాలు చేస్తారని కొందరు తప్పుడు సంకేతాలు తీసుకెళ్లారు. భద్రకాళీ బోనాల నిర్వహణపై సంప్రదింపుల తర్వాత కార్యచరణ ప్రకటిస్తాం. ఆగమశాస్త్రం ప్రకారమే భద్రకాళీ అమ్మవారికి బోనం సమర్పిస్తాం. గోదావరి పుష్కరాల విషయంలో కేంద్రం తెలుగు రాష్ట్రాలను సమంగా చూడాలి. తెలంగాణపై వివక్ష చూపొద్దు. గోదావరి పుష్కరాలకు రూ. 200 కోట్లు ఇవ్వాలని కేంద్రానికి లేఖ రాశాం. భద్రాచల రాముడి పాదాల నుంచే గోదావరి ప్రవహిస్తుంది. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ చొరవ చూపి.. పుష్కరాల కోసం నిధులు ఇప్పించాలి" అని మంత్రి కొండా సురేఖ కోరారు.

# దూసుకుపోయిన స్టాక్ మార్కెట్లు

**1,046 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్**

**319 పాయింట్లు లాభపడ్డ నిఫ్టీ**

**డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ. 86.59**




**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ లాభాలతో కళకళలాడాయి. అంతర్జాతీయంగా ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్నప్పటికీ, మన సూచీలు సానుకూలంగా స్పందించడం గమనార్హం. ఈ లాభాలతో గత మూడు రోజులుగా కొనసాగుతున్న నష్టాలకు తెరపడింది. మదుపరులు కొనుగోళ్లకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో మార్కెట్లు లాభాల బాట పట్టాయి.

శుక్రవారం ట్రేడింగ్‌లో బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 1,046 పాయింట్లు పెరిగి 82,408కి ఎగబాకింది. నిఫ్టీ కూడా 319 పాయింట్లు లాభపడి 25,112 వద్ద ముగిసింది. ముఖ్యంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆటోమొబైల్, మెటల్ రంగాల షేర్లలో కొనుగోళ్ల మద్దతు స్పష్టంగా కనిపించింది. వీటితో పాటు మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు కూడా లాభాలతో ముగియడం విశేషం.

సెన్సెక్స్ 30 సూచీలోని షేర్లలో మారుతీ సుజుకీ మినహా మిగిలిన అన్ని కంపెనీల షేర్లూ లాభాల్లోనే ముగిశాయి. ప్రధానంగా లాభపడిన వాటిలో భారతీ ఎయిర్‌టెల్, మహీంద్రా అండ్ మహీంద్రా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, రిలయన్స్ ఇండస్ట్రీస్, నెస్లే ఇండియా షేర్లు ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర 76 డాలర్లుగా ఉండగా, బంగారం ఔన్సు ధర 3,372 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఇక డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 86.59 వద్ద స్థిరపడింది.

## మారన్ సోదరుల మధ్య వివాదం..

**సన్ టీవీ షేర్లు 4 శాతం పతనం**




**ముంబై:** మారన్ సోదరుల మధ్య వివాదం.. సన్ టీవీ షేర్ల పతనానికి కారణమైంది. ఇవాళ ఆ ఛానల్ షేర్లు 4 శాతం డౌన్ అయ్యాయి. డీఎంకే ఎంపీ, మాజీ కేంద్ర మంత్రి దయానిధి మారన్.. తన సోదరుడు కళానిధి మారన్‌కు లీగల్ నోటీసులు పంపారు. సన్ టీవీ నెట్వర్క్ చైర్మన్‌గా కళానిధి మారన్ వ్యవహరిస్తున్నారు. 2003లో జరిగిన షేర్ల లావాదేవీలపై అంశంపై కళానిధి మారన్‌తో పాటు ఆయన భార్య కావేరి కళానిధికి దయానిధి మారన్ లీగల్ నోటీసులు ఇచ్చారు. సన్ టీవీ టేకోవర్ సమయంలో తప్పుడు విధానాలు, తప్పుడు పాలనతో అక్రమాలకు పాల్పడినట్లు కళానిధి మారన్‌పై దయానిధి మారన్ విమర్శలు చేశారు.

కోఆర్డినేటెడ్ పద్ధతిలో ఆర్థిక నేరాలకు తన సోదరుడు పాల్పడినట్లు దయానిధి మారన్ తన అఫిడవిట్‌లో తెలిపాడు. చీటింగ్, మనీ ల్యాండరింగ్‌కు కూడా పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసు ఆ కేసులో దర్యాప్తు చేపట్టనున్నట్లు నోటీసులో పేర్కొన్నారు. తండ్రి మురసోలీ మారన్ 2003లో మృతిచెందారు. అయితే ఆ తర్వాత జరిగిన సన్ టీవీ షేర్లు అప్పగింతలో వివాదం నెలకొన్నట్లు తెలుస్తోంది.

వీలునామా రాయకుండానే తండ్రి చనిపోయారని, అందుకే 2003 నాటి ప్రకారం షేర్ల పంపకం జరగాలన్నారు. సెబీ, ఆర్బీఐ, ఎస్ఎఫ్ఐఓ, ఈడీ, రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీలు ఈ విచారణలో పాల్గొనాలని కళానిధికి నోటీసులో తెలిపారు. కంపెనీలో కళానిధి మారన్‌కు 75 శాతం వాటా ఉన్నది. అది మార్కెట్ విలువ 25 వేల కోట్లు. సన్ టీవీ నెట్వర్క్ లో తమిళం, తెలుగు, హిందీ, బెంగాలీ భాషలు ఉన్నాయి. ఎఫ్ఎం రేడియో స్టేషన్లు ఉన్నాయి. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఉంది.

## భారీగా తగ్గనున్న బంగారం ధర..!

**పాత చౌక ధరలు మళ్లీ తిరిగి వస్తున్నాయి..**



**న్యూఢిల్లీ:** ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య భీకర దాడులు జరుగుతూ ఉద్రిక్తతలు నెలకొన్నా.. ఆ ప్రభావం బంగారంపై ఏ మాత్రం కనిపించడం లేదు. ఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం.. బంగారం ధర గరిష్ట స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. రాబోయే ఒకటి రెండు నెలల్లో బంగారం ధరల్లో దాదాపు 10 శాతం, వచ్చే ఏడాదిలో దాదాపు 30 శాతం మార్పు చూడవచ్చు. బులియన్ మార్కెట్లు ఇప్పటికే భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, కేంద్ర బ్యాంకు కొనుగోళ్లు, ఈటీఎఫ్ డిమాండ్, డీ-డాలరైజేషన్‌ను ఫ్యాక్టర్ చేశాయని నిపుణులు అంటున్నారు. సిటీబ్యాంక్ వచ్చే ఏడాదికి బంగారం ధర అంచనాలను తగ్గించింది. దాని నివేదిక ప్రకారం.. సిటీబ్యాంక్ రాబోయే మూడు నెలలకు బంగారం రేటు అంచనాను ఔన్సుకు 3,500 నుండి 3,300 డాలర్లకు తగ్గించింది. తదుపరి 6-12 నెలలకు గతంలో ఔన్సుకు 3,000 డాలర్ల నుండి 2,800 డాలర్లకు తగ్గించింది.

"గత 10-20 సంవత్సరాలలో మధ్యప్రాచ్యంలో, నల్ల సముద్రంలో ఒకేసారి యుద్ధాలు జరుగుతున్న పరిస్థితిని మనం చూడలేదు. ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం జరుగుతున్న ఏడు రోజుల్లో మొదటి రోజు బంగారం ధర పెరిగింది. కానీ ఆ తర్వాత ఉద్రిక్తతలు పెరిగినప్పటికీ బంగారం ధరలపై ప్రభావం పడటం లేదు." అని కేడియా అడ్వైజరీకి చెందిన అజయ్ కేడియా అన్నారు. అయితే గతంలో ఇలాంటి పెరుగుదల సమయంలో బంగారం ధరలు కాస్త వెనక్కి తగ్గి తిరిగి కోలుకోవడం గమనించామని ఆయన అన్నారు.

ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ గోల్డ్ ఔన్స్ కు 3,371.15 డాలర్ల వద్ద ఉంది. అయితే గత ఐదు సంవత్సరాలలో మనం విన్న కథ ఏదైనా.. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, కేంద్ర బ్యాంకు కొనుగోళ్లు, ఈటీఎఫ్ డిమాండ్, డీడాలరైజేషన్, బులియన్ మార్కెట్ ఇప్పటికే దీనికి కారణమైంది అని ఆయన అన్నారు. రాబోయే ఒకటి-రెండు నెలల్లో బంగారం ధరల్లో 8-10 శాతం తేడాను చూడవచ్చు. వచ్చే ఏడాదిలో బంగారం ధర 2,700-2,800 డాలర్లకు తగ్గవచ్చు. ప్రపంచ ఉద్రిక్తతలు గణనీయంగా తగ్గితే అది 2,400 డాలర్లకు కూడా తగ్గవచ్చు అని కేడియా పేర్కొన్నారు.



# హాకీ క్రీడాకారులకు బొనాంజా..

**ఇకపై నెలనెలా రూ. 25 వేలు..!**

**న్యూఢిల్లీ:** భారత హాకీ క్రీడాకారులకు గుడ్‌న్యూస్. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వాళ్ల కోరిక ఫలించనుంది. అంతర్జాతీయ స్థాయిలో అదరగొడుతున్న ఆటగాళ్లకు ప్రోత్సాహకంగా కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ బంపర్ బొనాంజా ఇవ్వనుంది. జాతీయ క్యాంప్‌నకు ఎంపికైన పురుష, మహిళా ప్లేయర్లకు ప్రతి నెల అదనంగా రూ.25వేలు చెల్లించనుంది. గురువారం జరిగిన మిషన్ ఒలింపిక్ సెల్స్ నెలవారీ సమావేశంలో హాకీ ఇండియా అభ్యర్థనను అంగీకరించిన మంత్రిత్వ శాఖ.. టార్గెట్ ఒలింపిక్ పోడియం పథకం కింద ఈ అలవెన్స్ అందజేస్తామని మంత్రి మన్సుఖ్ మాండవీయ తెలిపారు. ఈ స్కీమ్ ద్వారా మొత్తంగా 80 మంది (40 మంది పురుషులు, 40 మంది మహిళా క్రీడాకారులు) లబ్ది పొందనున్నారని హాకీ ఇండియా వెల్లడించింది.

హాకీ ప్లేయర్లకు అదనపు భత్యం ఇవ్వాలని హాకీ ఇండియా పలుమార్లు విజ్ఞప్తి చేసింది. ఈ విషయంపై గురువారం జరిగిన మిషన్ ఒలింపిక్ సెల్ సమావేశంలో చర్చ జరిగింది. ఆటగాళ్లను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నెల నెలా రూ.25 వేలు ఇవ్వాలని నిర్ణయించాం. ఫామ్, ఫిట్‌నెస్.. ఈ రెండు అంశాల ఆధారంగా ఆటగాళ్లను ఎంపిక చేస్తాం అని మంత్రి మాండవీయ వెల్లడించారు. అంతేకాదు ఈ సమావేశంలో కోర్ గ్రూప్ అథ్లెట్లకు ప్రతి నెల రూ.50 వేలు ఇవ్వాలని తీర్మానించామని ఆయన తెలిపారు. హాకీ ఆటగాళ్లకు నెలనెలా రూ.25 వేలు ఇవ్వడం కోసం ప్రభుత్వం రూ.20 లక్షలు ఖర్చు చేయనుంది.



పారిస్ ఒలింపిక్స్‌లో భారత ఆటగాళ్ల సంబురాలు

క్రికెటర్ల మాదిరిగానే తమకూ సెంట్రల్ కాంట్రాక్ట్ ఇవ్వాలని హాకీ ఆటగాళ్లు ఎప్పటినుంచో కోరుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రిత్వ శాఖ నెల నెలా రూ.25 వేలు ఇవ్వాలని నిర్ణయించడం క్రీడాకారులకు ఎంతగానో ఉపయుక్తం కానుంది. గత కొన్నేళ్లుగా భారత పురుషుల, మహిళల జట్లు అంతర్జాతీయ స్థాయిలో అదరగొడుతున్నాయి. టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యంతో మెరిసిన హర్మన్‌ప్రీత్ సింగ్ బృందం.. పారిస్ విశ్వక్రీడల్లోనూ సంచలన ప్రదర్శనతో కంచు మోత మోగించి చరిత్ర సృష్టించింది. అయితే.. ఎఫ్ఐహెచ్ హాకీ ప్రో లీగ్‌లో మాత్రం వరుస వైఫల్యాలతో తీవ్రంగా నిరాశపరుస్తోంది.

# సెంచరీతో కదంతొక్కిన యశస్వీ

**భారీ స్కోర్ దిశగా టీమిండియా..!**

**లీడ్స్:** భారత యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్(100 నాటౌట్) ఇంగ్లండ్ గడ్డపై శతక గర్జన చేశాడు. నిరుడు వెస్టిండీస్, ఆస్ట్రేలియా పర్యటనల్లో సెంచరీతో చెలరేగిన ఈ యంగ్ సంచనలం.. ఇంగ్లండ్ బౌలర్ల భరతం పడతూ ఐదోసారి మూడంకెల స్కోర్ అందుకున్నాడు. హెడింగ్లేలో జరుగుతున్న తొలి టెస్టులో క్రీజులో పాతుకుపోయిన ఈ యంగ్‌స్టర్ విధ్వంసక సెంచరీతో జట్టు భారీ స్కోర్‌కు బాటలు వేశాడు.

పేసర్ బ్రాండన్ కార్సే ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు, ఆపై సింగిల్ తీసిన యశస్వీ టెస్టుల్లో వంద నమోదు చేశాడు. మరో ఎండ్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్(58 నాటౌట్) కూడా చెలరేగి ఆడుతున్నాడు. దాంతో, టీమిండియా భారీ స్కోర్ దిశగా సాగుతోంది. ఈ ఇద్దరి విధ్వంసంతో భారత్ టీ సమయానికి 2 వికెట్లు కోల్పోయి 215 పరుగులు చేసింది.



**ఏజ్ ఫ్రాడ్‌కు చెక్.. ఇకపై అండర్-16 క్రికెటర్లకు**

# 'సెకండ్ బోన్' టెస్టు..!

**న్యూఢిల్లీ:** క్రికెట్ అనే కాదు పలు ఆటల్లో కొందరు ఆటగాళ్ల వయసుపై వివాదాలు తలెత్తడం చూశాం. ఐపీఎల్ 18 వ సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ కూడా ఏజ్ ఫ్రాడ్ ఆరోపణలు ఎదుర్కొన్నాడు. అంతేకాదు అండర్ -16 ఆటగాళ్లను తదుపరి సీజన్‌లో వయసు పైబడిందనే కారణంతో అనుమతించడం లేదు. దాంతో, ఈ సమస్యలకు పరిష్కారం చూపే దిశగా భారత క్రికెట్ నియంత్రణ మండలి కీలక నిర్ణయం తీసుకుంది.

ఇకపై జూనియర్ స్థాయిలో ఏ క్రికెటర్ కూడా వయసును కప్పిపుచ్చకుండా వైద్యపరీక్షలను కఠినతరం చేసింది. ఇప్పటివరకూ 14-16 ఏళ్ల అబ్బాయిలకే బోన్ టెస్ట్ జరిపేవారు. ఈ పరీక్షలో నిర్ధారణ అయిన వయసుకు ఒక ఏడాదిని కలిపేవారు. అంటే.. ఉదహరణకు ఒక ఆటగాడి వయసు 14.3 సంవత్సరాలు అనుకోండి.. బీసీసీఐ ప్రకారం అతడికి 15.3 సంవత్సరాలు ఉన్నట్టుగా పరిగణిస్తారు. దీన్నే మ్యాథమేటికల్ ఏజ్ అని పిలుస్తారు.

### ఎంపిక సమయంలో

జూనియర్ స్థాయిలో ఆటగాళ్ల ఎంపిక సమయంలో బోన్ టెస్టు చేస్తారు. ఈ పరీక్షలో వారి వయసును పక్కాగా లెక్కించడం సాధ్యమవుతుంది. అయితే..ఈ ఏడాది అండర్ -



16 టీమ్‌లో ఆడిన వాళ్లు తదుపరి సీజన్ సమయానికి వయసు 17క చేరడంతో అనర్హతకు గురవుతున్నారు. అందుకు.. ఇకపై వీళ్లకు సెకండ్ బోన్ టెస్టు జరపాలని బీసీసీఐ నిర్ణయించింది. ఈ టెస్టును 16 ఏళ్లున్న అబ్బాయిలకు, 15 ఏళ్లున్న అమ్మాయిలకు నిర్వహిస్తామని తెలిపింది.

ఎముకల సాంద్రత, పరిమాణం వంటివి నిర్దేశించిన పరిమాణం కంటే ఎక్కువ ఉంటే వాళ్లను పక్కనపెట్టాలని బోర్డు సెలెక్టర్లకు సూచించనుంది. అందుకే కానీ, దాంతో, భవిష్యత్‌లో ఏజ్ ఫ్రాడ్ అనే విషయమే తెరపైకి రాదని బీసీసీఐ భావిస్తోంది. తద్వారా అండర్ -16 ఆటగాళ్లకు రెండోసారి బోన్ టెస్ట్ చేయడం ద్వారా వాళ్ల వయసును తెలుసుకొని.. టోర్నీలో ఆడేందుకు అవకాశం కల్పించనుంది. మామూలుగా ప్రతిసారి దేశవాళీ సీజన్ ప్రారంభం ముందు అందరికీ ఎక్స్- రే ద్వారా ఏజ్ టెస్టు నిర్వహిస్తారు. ప్రతి రాష్ట్రం నుంచి 40-50 మంది అబ్బాయిలకు, 20-25 మంది అమ్మాయిలకు ఈ టెస్టు నిర్వహిస్తారు.

# విమాన ప్రమాద మృతులకు నివాళి..



**నల్లరిబ్బన్లతో భారత్, ఇంగ్లండ్ ఆటగాళ్లు..!**

**లీడ్స్:** ఇంగ్లండ్ పర్యటనలో టీమిండియా తొలి పరీక్షను ఎదుర్కొంటోంది. లీడ్స్‌లోని హెడింగ్లేలో టాస్ గెలిచిన ఆతిథ్య జట్టు సారథి టీమిండియాను బ్యాటింగకు ఆహ్వానించాడు. ప్రత్యర్థి పేసర్లను అలవోకగా ఆడేస్తూ ఓపెనర్లు యశస్వీ జైస్వాల్0, కేఎల్ రాహుల్ శుభారంభం ఇచ్చారు. ఇంట్రాస్క్వాడ్ మ్యాచ్‌లో అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతులకు సంతాపం తెలిపిన భారత క్రికెటర్లు.. తొలి టెస్టు ఆరంభానికి ముందు కూడా నివాళులు అర్పించారు. టాస్ అనంతరం మైదానంలోకి దిగడానికి.. ఇంగ్లండ్ ఆటగాళ్లు అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతులకు నివాళులు అర్పించారు. హెడింగ్లే మైదానంలోకి దిగడానికి ముందు 2 నిమిషాలు మౌనం పాటించారు. అంతేకాదు నల్లబ్యాడ్జీలు ధరించి ఆటకు సిద్ధమయ్యారు. జూన్ 12న జరిగిన ఎయిరిండియా బోయింగ్ 171 డ్రీమ్‌లైనర్ విమానం ఘోర విమాన ప్రమాదంలో అందులోని మంది ప్రాణాలు కోల్పోయారు. బీజే ఆస్పత్రి కళాశాలపై విమానం కూలడంతో వైద్య విద్యార్థులు దుర్మరణం చెందారు.

యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిన ఈ ఘటనపై పలు దేశాధినేతలు విచారం వ్యక్తం చేశారు. భారత క్రికెటర్లు కూడా సంతాపం తెలిపారు. ఈ సంఘటనతో బాధలో ఉన్నందున డబ్ల్యూటీసీ ఫైనల్ సమయంలో జరగాల్సిన అండర్సన్ - టెండూల్కర్ ట్రోఫీ ఆవిష్కరణ వాయిదా పడింది. అయితే.. తొలి టెస్టుకు ముందు సచిన్ అండర్సన్‌లు తమ పేరుతో నిర్వహిస్తున్న ట్రోఫీని ఆవిష్కరించి మురిసిపోయారు. ఈ సిరీస్‌లో గెలుపొందిన జట్టు కెప్టెన్‌కు 'పటౌడీ మెడల్'ను ఇస్తామని ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు వెల్లడించిన విషయం తెలిసిందే.



# నాని హిట్-3 సినిమాకు చిక్కులు

### కథను కాపీ కొట్టారంటూ కోర్టుకెక్కిన రచయిత

**టాకీస్:** నాచురల్ స్టార్ నాని హీరోగా, శైలేష్ కొలను దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'హిట్-3'. మే 1వ విడుదలైన ఈ సినిమా ఘన విజయం సాధించింది. నాని కెరీర్‌లోనే 100 కోట్ల క్లబ్‌లో చేరింది. అయితే తాజాగా ఈ సినిమా చిక్కుల్లో పడింది. ఈ సినిమాలో తన కథను కాపీ కొట్టారని అంటూ.. ఓమహిళ కోర్టుకెక్కింది. హిట్-1, హిట్-2 చిత్రాల సిరీస్‌లో భాగంగా శైలేష్ హిట్-3ని తెరకెక్కించారు. అయితే తన స్టోరీని కాపీ కొట్టారంటూ మహిళా రచయిత విమల్ సోని మద్రాస్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అంతేకాక విమల్ సోని నానికి వీరాభిమాని అని పేర్కొన్నారు. తాను రాసిన ఏజెంట్ 11, ఏజెంట్ కథల నుంచి హిట్-3 సినిమాను తీశారని ఆమె తెలిపారు. దీంతో హిట్-3 మేకర్స్‌పై కాపీరైట్ కేసు వేశారు. ఆమె రచించిన ఒరిజినల్ కాపీని కోర్టుకు సమర్పించారు. అయితే గతంలో కూడా దర్శకుడు శైలేష్ కొలను ఇలాంటి వివాదాన్ని ఎదురుకున్నారు. వెంకటేష్ హీరోగా ఆయన 'సైంథవ్' అనే సినిమాను తెరకెక్కించిన విషయం తెలిసిందే. ఈ సినిమా కథను కూడా కాపీ కొట్టారు అంటూ అప్పట్లో ఆరోపణలు వచ్చాయి.

## అల్లు అర్జున్, అట్లీ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్‌గా సాయి అభ్యంకర్ ఫిక్స్!

**టాకీస్:** పాన్ ఇండియా స్టార్ అల్లు అర్జున్ హీరోగా కోలీవుడ్ స్టార్ దర్శకుడు అట్లీ డైరెక్షన్ లో సినిమా వస్తున్నా సంగతి తెలిసిందే. బన్నీ కెరీర్ లో 22వ సినిమాగా వస్తున్న ఈ సినిమాపై ఇప్పటి నుండే అంచనాలు ఓ రేంజ్ లో ఉన్నాయి. కోలీవుడ్ బిగ్గెస్ట్ ప్రొడక్షన్స్ లో ఒకటైన సన్ పిక్చర్స్ అత్యంత భారీ బడ్జెట్ పై ఈ సినిమాను నిర్మిస్తోంది. దీపికా పాడుకొనే, మృణాల్ ఠాకూర్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు.



కాగా ఈ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్ ఎవరు అనే క్యూరియాసిటీ నెలకొంది. అనిరుధ్, సాయి అబ్యాంకర్ వీరి ఇద్దరు పేర్లు గత కొన్ని నెలలుగా వినిపిస్తున్నాయి. కానీ ఎవరిని లాక్ చేయలేదు మేకర్స్. ఇప్పుడు అందుతున్న విస్వసనీయ సమాచారం ప్రకారం అల్లు అర్జున్, అట్లీ సినిమాకు కోలీవుడ్ యంగ్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ ను ఫిక్స్ చేసారని తెలిసింది. త్వరలోనే ఈ విషయాన్నీ అధికారకంగా ప్రకటించ బోతున్నారట మేకర్స్. కోలీవుడ్ లో ఇప్పుడు సాయి సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాడు. ఇప్పటికే సూర్య నటిస్తున్న భారీ యాక్షన్ చిత్రం కరుప్పు తో పాటు లోకేష్ కనగరాజ్ నిర్మిస్తున్న బెంజ్, ప్రదీప్ రంగనాథన్ డ్యూడ్ సినిమాలకు మ్యూజిక్ అందిస్తున్నాడు. ఇప్పుడు అల్లుఅర్జున్ ? అట్లీ కాంబోకు కు కూడా ఈ యువ సంచలం మ్యూజిక్ ఇస్తుండడం మనోడి క్రేజ్ ఎలా ఉందో తెలుస్తోంది.

# నటనతో ఆకట్టుకుంటున్న మాళవిక నాయర్..



టాకీస్: మాళవిక నాయర్.. ఈ చిన్నది టాలీవుడ్ లో మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. చూడటానికి క్యూట్ గా ఉండే ఈ భామ.. తన నటనతోనూ ఆకట్టుకుంటుంది. నాని నటించిన ఎవడె సుబ్రహ్మణ్యం సినిమాతో టాలీవుడ్ కు హీరోయిన్ గా పరిచయం అయ్యింది ఈ చిన్నది. తొలి సినిమాతోనే నటనతో ఆకట్టుకుంది. ఆ సినిమాలో మాళవిక నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఈ సినిమా తర్వాత వరుస అవకాశాలు అందుకుంది . నాగ శౌర్య తో కలిసి కళ్యాణమే వైభోగం, ఒరేయ్ బుజ్జిగా, నాగ చైతన్య థాంక్యూ సినిమాల్లో నటించి మెప్పించింది మాళవిక. ఇక ఇప్పుడు ఫలానా అబ్బాయి.. ఫలానా అమ్మాయి అనే సినిమాలో చేస్తోంది. ఈ సినిమాలో మరోసారి నాగ శౌర్యతో జత కట్టింది ఈ భామ. అయితే కెరీర్ స్టార్టింగ్ నుంచి ఈ భామ స్కిన్ షోకు దూరంగా ఉంటూ వచ్చింది. అయితే ఇప్పుడు మాత్రం ఈ అమ్మడు గ్లామర్ షోకు.. ఇంటెన్స్ సీన్స్ కు ఎలాంటి ఇబ్బంది లేదు అంటుంది. అదే రేంజ్ లో రెచ్చిపోతుంది కూడా.. మొన్నామధ్య ఫలానా అబ్బాయి.. ఫలానా అమ్మాయి సినిమాలో గ్లామర్ టచ్ ఇచ్చింది. ఓ ఇంటర్వ్యూలో ఇంటెన్స్ సీన్స్ లో నటించడం పై స్పందిస్తూ.. ఆసక్తికర కామెంట్స్ చేసింది మాళవిక. తనకు ఇంటెన్స్ సీన్స్ లో, బోల్డ్ సీన్స్ లో నటించడానికి ఎలాంటి ఇబ్బంది లేదు అని తెలిపింది. అవి కావాలని చేసేవి కాదు.. సినిమా కోసం చేసేవి. సీన్ కు తగ్గట్టుగా చేయాల్సిందే.. కాబట్టి నాకు ఎలాంటి ఇబ్బంది లేదు అని తెలిపింది మాళవిక. ఇక ఈ అమ్మడు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా ఫోటోలు వీడియోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంది.తాజాగా ఈ ముద్దుగుమ్మ షేర్ చేసిన ఫోటోలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి.

## 'కరుప్పు' అంటూ వస్తున్న సూర్య..

### టైటిల్ ఫస్ట్ లుక్ రిలీజ్




**టాకీస్:** తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటులలో కథానాయకుడు సూర్య ఒకరు. ఆయన నటించిన ప్రతి సినిమా ఇక్కడ కూడా విడుదలవుతుంది. అంతేకాదు, వైవిధ్యానికి పెద్ద పీట వేస్తూ ఆసక్తికర చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వస్తారు. ఇప్పటికే తెలుగు దర్శకుడు వెంకి అట్లూరితో సినిమా చేస్తున్న సూర్య తమిళ కమెడియన్ ఆర్జే బాలాజీ దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్నాడు. సూర్య 45గా రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి తాజాగా ఫస్ట్‌లుక్‌తో పాటు టైటిల్‌ను ప్రకటించింది చిత్రయూనిట్. ఈ సినిమాకు కరుప్పు (నలుపు) అనే టైటిల్ పెట్టినట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ మూవీకి సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నాడు.

## సినిమా వాళ్ల కోసం సితారే జమీన్ పర్

**టాకీస్:** బాలీవుడ్ స్టార్‌హీరో ఆమిర్ ఖాన్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'సితారే జమీన్ పర్'. స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో ఆర్.ఎస్.ప్రసన్న దీనిని రూపొందించారు. ఆమిర్‌ఖాన్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించింది. సినీ తారల కోసం గురువారం సాయంత్రం ఈ సినిమా ప్రీమియర్ షో ముంబయిలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి బాలీవుడ్ స్టార్ హీరోలు షారుక్ ఖాన్, సల్మాన్ ఖాన్, అలనాటి నటి రేఖ, నటుడు విక్కీ కౌశల్‌తోపాటు పలువురు హాజరయ్యారు.




సినిమా వీక్షించిన అనంతరం చిత్రబృందంతో తమ అభిప్రాయాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆమిర్ ప్రత్యేకాకర్షణగా నిలిచారు. తన ప్రియురాలు గౌరీ స్ప్రాట్‌తో కలిసి ఆయన ఈ వేడుకలో సందడి చేశారు. ఆమెతో చిరునవ్వులు చిందిస్తూ ఫొటోలకు పోజులిచ్చారు.

ఇదే కార్యక్రమంలో పాల్గొన్న సల్మాన్‌ఖాన్.. తన స్నేహితుడు ఆమిర్‌పై జోకులు వేశారు. ఈ సినిమా తానే చేయాల్సిందని మధ్యలో ఆమిర్ వచ్చి చేరారంటూ సరదాగా చెప్పారు. 'ఈ సినిమా తెరకెక్కించడానికి ముందు ఏం జరిగిందో మీకు తెలియదు. ఈరోజు నేను మీతో ఆ కథంతా చెబుతా. ఓసారి ఆమిర్ నన్ను ఇంటికి ఆహ్వానించి ఈ కథ గురించి చెప్పాడు. కథ నాకెంతో నచ్చింది. తప్పకుండా చేస్తానని చెప్పా. కొన్నిరోజుల తర్వాత ఆయన నుంచి ఫోన్ వచ్చింది. తానే ఈ సినిమా చేస్తున్నానని చెప్పాడు.

# 8 వసంతాలు...కొత్త ప్రయత్నం




**టాకీస్:** అగ్ర నిర్మాణ సంస్థలు అప్పుడప్పుడూ కొత్తతరంతో... పరిమిత వ్యయంతో కూడిన సినిమాలు కూడా నిర్మిస్తుంటాయి. అలా మైత్రీ మూవీ మేకర్స్ నుంచి వచ్చిన చిత్రమే... '8 వసంతాలు'. పలువురు కొత్తతరం నటులు కలిసి నటించిన ఈ చిత్రం శుక్రవారం పరేక్షకుల ముందుకు వచ్చింద. ఓ ప్రేమజంట జీవితంలోని 8 వసంతాల కథ ఇది. శుద్ధి అయోధ్య (అనంతిక సనీల్‌కుమార్) అనే యువతి ఓ రచయిత. ఊటీలో ఉంటూ తన టీనేజ్‌లోనే ఓ పుస్తకం రాస్తుంది. దాంతో ఎంతోమంది అభిమానుల్ని సొంతం చేసుకుంటుంది. మార్షల్ ఆర్ట్స్‌లోనూ ఆమె ప్రావీణ్యం సంపాదిస్తుంది. ప్రయాణాలు, రచనలు, మార్షల్ ఆర్ట్స్‌తో గడుపుతున్న ఆమె జీవితంలోకి వరుణ్ (హను రెడ్డి) వస్తాడు. కొన్ని రోజుల్లోనే ఇద్దరి మనసులు కలుస్తాయి. వరుణ్ తన మనసులోని మాటని చెబుతాడు. శుద్ధి కొంత సమయం కావాలని కోరుతుంది. అందుకు వరుణ్ కూడా అంగీకారం చెబుతాడు. అలా కొన్ని నెలలు గడిచిపోతాయి. ఆ తర్వాత శుద్ధి తన మనసులోని ప్రేమని వ్యక్తపరచాలని ఎంతో ఆత్రుతగా వరుణ్ దగ్గరికి వస్తుంది. మరి వరుణ్... ఆమె ప్రేమని స్వీకరించాడా? ఈ మధ్యలో వరుణ్ జీవితంలో ఏం జరిగింది? వరుణ్ విదేశాలకు వెళ్లిపోయిన తర్వాత ఆమె జీవితంలోకి వచ్చిన సంజయ్ (రవి దుగ్గిరాల) ఎవరు? శుద్ధి ఎనిమిది వసంతాల ప్రేమ ప్రయాణంలో ఎన్నో మలుపులు చోటుచేసుకున్నాయన్నది చిత్ర కథ. 8 వసంతాలు కవితాత్మకంగా సాగే ఓ ప్రేమకథ ఇది. తెరపైన కనిపించే ప్రతి ఫ్రేమ్... ప్రతి సంభాషణ భావుకతని నింపుకొని ఉంటాయి. విజువల్స్ వరకూ కట్టిపడేసినా... ఒక దశ దాటిన తర్వాత సంభాషణలే కృత్రిమంగా అనిపిస్తాయి. అవి సినిమాపై ఏమాత్రం ప్రభావం చూపించకపోగా, పాత్రలతో పనిగట్టుకొని పలికించినట్టుగా అనిపిస్తాయి. భావుకత గురించి ఎక్కువగా ఆలోచించిన దర్శకుడు... భావోద్వేగాల సంగతిని మరిచిపోయాడు. దాంతో కథ హృదయాల్ని తాకదు. కథనం నెమ్మదిస్తుంది. కొంతలో కొంత ప్రథమార్ధం ఈ సినిమాకి బలం. వరుణ్, శుద్ధి కలవడం, ఆ ఇద్దరి మధ్య ప్రేమ చిగురించే సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. విరామ సన్నివేశాలు ద్వితీయార్ధంపై ఆసక్తిని పెంచుతాయి. అందంగా కనిపించిన హను రెడ్డి, అనంత మధ్య కెమిస్ట్రీ, హెషామ్ సంగీతం సినిమాని ఆకర్షణీయంగా మార్చేశాయి. అయితే విరామం తర్వాత సినిమా పూర్తిగా గాడి తప్పినట్లు అనిపించింది. ద్వితీయార్ధంలోని

# శేఖర్ కమ్ములకు పరీక్ష పెట్టిన కుబేర




**టాకీస్:** ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల రూపొందించిన తొలి మల్టీస్టారర్, పాన్ ఇండియా మూవీ 'కుబేర'. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ నిర్మించిన ఈ చిత్రానికి శేఖర్ కమ్ముల సైతం నిర్మాణ భాగస్వామి. నాగార్జున, ధనుష్, రశ్మికా మందణ్ణ కీలక పాత్రలు పోషించిన 'కుబేర' ప్రేక్షకుల ముందుకు వచ్చింది.

దాదాపు 140 కోట్ల జనాభా ఉన్న భారతదేశంలో ఉన్నవారికి, లేనివారికి మధ్య వ్యత్యాసం నానాటికి పెరిగిపోతోంది తప్పితే తగ్గడం లేదు. ధనవంతులు మరీ ధనవంతులు అవుతుంటే, బీదవారు ప్రభుత్వాల సబ్సిడీలతో జీవితాల్ని వెళ్ళబుచ్చుతున్నారు. ఈ సబ్సిడీలు రాజకీయ పార్టీలు ఎన్నికల సందర్భంగా ఇచ్చే తాయిలాలు మాదిరిగా అయిపోయాయి. ప్రభుత్వాధీనంలో ఉండాల్సిన ప్రధాన రంగాలు సైతం నిదానంగా కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్ళిపోతున్నాయి. వాటి ద్వారా కోటాను కోట్లు సంపాదిస్తున్న ఆ కంపెనీలే ప్రభుత్వాలను ఆటాడిస్తున్నాయి. అలాంటి ఓ కార్పొరేట్ టైకూన్ కథే 'కుబేర'. దేశంలోనే అత్యంత ధనికుడైన నీరజ్ మిత్ర (జిమ్ సార్బ్) కు వరల్డ్ రిచెస్ట్ పర్సన్ గా నిలవాలనే కోరిక. దాంతో కేంద్ర మంత్రి సిద్ధప్ప (హరీశ్ పేరడి)తో డీల్ కుదుర్చుకుని లక్షల కోట్ల లంచం ఇచ్చి బంగాళఖాతంలోని ఆయిల్ డిగ్గింగ్ ఏరియాను తన వశం చేసుకుంటాడు. ప్రభుత్వానికి ఇవ్వాల్సిన లంచంలో సగం వైట్ లో, సగం బ్లాక్ లో ఇవ్వాల్సి వస్తుంది. దాంతో నిజాయితీతో నడుచుకుని జైలు పాలైన సస్పెండెడ్ సీబీఐ ఆఫీసర్ దీపక్ రాజ్ (నాగార్జున) సాయం తీసుకుంటాడు. అతన్ని జైలు నుండి బయటకు తీసుకొచ్చి... ఈ డీల్ ను ఫుల్ ఫిల్ చేసే పనిని అప్పగిస్తాడు. రంగంలోకి దిగిన దీపక్... నలుగురు బిచ్చగాళ్ళను ఎంచుకుని వారి ద్వారా కథ నడుపుతాడు. అలా వీరు ఎంచుకున్న దేవా (ధనుష్) అనే బిచ్చగాడి కారణంగా పరిస్థితులు చేజారిపోతాయి. ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు నీరజ్ ఇవ్వాల్సిన లక్షల కోట్ల లంచం ముట్ట చెప్పగలిగాడా? వరల్డ్ రిచ్చెస్ట్ పర్సన్ కావాలనుకున్న నీరజ్ కోరిక నెరవేరిందా? తిరుపతిలో బిచ్చగాడిగా ఉన్న దేవా... ప్రభుత్వాలను శాసించగలిగే కార్పొరేట్ టైకూన్ జీవితాన్ని ఎలా అల్లకల్లోలం చేశాడు? అనేది 'కుబేర' కథ. రాజకీయ నాయకులకు బినామీలు ఉన్నట్టే... కార్పొరేట్ సంస్థలు బినామీలతో షెల్ కంపెనీస్ నిర్వహిస్తుంటాయి. వాటి ద్వారా కోటానుకోట్ల ట్రాన్సాక్షన్స్ చేస్తుంటాయి. ఒకవేళ అవినీతి నిరోధక శాఖ వంటి వారు వీరిని టచ్ చేసినా... చేతికి మట్టి అంటకుండా హాయిగా దులిపేసుకుంటారు. అనామకుల పేర్లతో దందాను సజావుగా నడిపేస్తుంటారు. ఇందులో ఆ అనామకులు నలుగురు బిచ్చగాళ్ళు! అదే ఈ కథలోని కొత్తదనం.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.